బడిగంట మోగింది

జిల్లావ్యాప్తంగా పాఠశాలలు పునఃప్రారంభం

విద్యార్థులకు కిట్లు, పాఠ్యపుస్తకాల పంపిణీ



విజయవాడలోని స్కూల్‌కు ఉత్సాహంగా వెళ్తున్న విద్యార్థులు

మచిలీపట్నంలోని క్యాంపుబెల్‌పేటలో విద్యార్థులకు కిట్లు, పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈవో

మచిలీపట్నం టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : 40 రోజుల వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు గురువారం పునఃప్రారంభమయ్యాయి. తొలిరోజే విద్యార్థులు అధిక సంఖ్యలో పాఠశాలలకు తరలివచ్చారు. అలాగే, బదిలీలు, పదోన్నతుల అనంతరం వివిధ పాఠశాలలకు నూతన ఉపాధ్యాయులు వచ్చారు. కాగా, ఆర్‌జేడీ నాగమణి, డీఈవో రామారావు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల్లోని పాఠశాలల్లో గురువారం విద్యార్థులకు కిట్లు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. మొదటిరోజు విద్యార్థులు పరుగుపరుగున వచ్చారు. క్యాంపుబెల్‌పేటలోని యూపీ పాఠశాలలో ఎంఈవో ఎం.దుర్గాప్రసాద్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు.

• విజయోత్సవం



'సుపరిపాలనకు ఏడాది' పేరుతో టీడీపీ మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయం వద్ద గురువారం విజయోత్సవాలు నిర్వహించారు. మంత్రి కొల్లు రవీంద్రతో పాటు టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, టీడీపీ నగర అధ్యక్షుడు లోగిశెట్టి వెంకటస్వామి, కార్యదర్శి బచ్చుల అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర టీడీపీ నాయకులు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు.

4

బదిలీ బేరాలు

పంచాయతీ కార్యదర్శుల బదిలీల్లో ఇష్టారాజ్యం

చక్రం తిప్పిన పంచాయతీ కార్యదర్శులు, డీపీవో కార్యాలయ సిబ్బంది

మచిలీపట్నంలోని డీపీవో కార్యాలయ అధికారులకు ఉద్యోగుల బదిలీలు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. కొందరు ఉద్యోగులు దళారీల అవతారమెత్తి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. అనధికారికంగా పెత్తనం చెలాయించే కొందరు పంచాయతీ కార్యదర్శులు తమదైనశైలిలో చక్రంతిప్పి నగదు వసూళ్లకు పాల్పడటంపై పంచాయతీరాజ్ విభాగంలో చర్చ జరుగుతోంది.

- ఐదేళ్లు దాటినా నగదు ఇస్తే సొంత మండలంలోనే పోస్టింగ్
- కార్యాలయంలోనే అక్రమాలకు తెరలేపి బేరసారాలు
- మామూళ్లు ముట్టడంతో వంత పాడుతున్న ఉన్నతాధికారులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నం సౌత్ మండలంలోని మేజర్ పంచాయతీలో పనిచేస్తున్న సీనియర్ పంచాయతీ కార్యదర్శి ఒకరు ఉద్యోగుల బదిలీల నోటిఫికేషన్ వెలువడగానే, తన పంచాయతీకి వెళ్లకుండా, డీపీవో కార్యాలయంలోనే తిష్ట వేశాడు. బదిలీల కోసం దరఖాస్తు చేసుకునేందుకు డీపీవో కార్యాలయానికి వచ్చిన వారితో మాటలు కలిపాడు. తనకు డీపీవోతో పాటు కార్యాలయంలో పనిచేసే అధికారులంతా తెలుసని, తాను చెప్పినట్టుగా వింటారని నమ్మించాడు. వారి ఎదుటే అధికారులతో మాట్లాడటం, ఇతర పనులు చేస్తూ హడావిడి చేశాడు. బదిలీల కోసం దరఖాస్తు చేసుకునే సమయంలో ఉద్యోగులకు వల వేశాడు. కోరుకున్న పంచాయతీకి బదిలీ చేయిస్తానని నమ్మబలికాడు. డీపీవో కార్యాలయ అధికారులు కూడా ఈ కార్యదర్శి చెప్పిన పనులు చేస్తుండటంతో తెరవెనుక బేరాలు కుదుర్చుకున్నాడు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధుల సిఫార్సుల లేఖలను సైతం పక్కనపెట్టించి, మీరు కోరుకున్న పంచాయతీకి బదిలీ చేయిస్తానని నమ్మించి, ఒక్కో పంచాయతీ కార్యదర్శి నుంచి పెద్దమొత్తంలో నగదు వసూలు చేశాడు. ఈ కార్యదర్శికి మరికొందరు వంత పాడారు. ఈ పంచాయతీ కార్యదర్శి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాడని కొందరు పంచాయతీ కార్యదర్శులు డీపీవో అధికారులకు ఫిర్యాదుచేసినా వారు పట్టించుకోలేదు. ఈ కార్యదర్శి, ఆయనకు మద్దతుగా ఉన్న కార్యదర్శుల సూచనల మేరకు డీపీవో కార్యాలయ అధికారులు బదిలీల జాబితాలను తయారుచేశారు. ఈ జాబితాలను కలెక్టర్‌కు పంపి ఆమోదింపజేసుకున్నారు.



ఇటీవల జరిగిన బదిలీల్లో ఉమ్మడి జిల్లాలో 35 మంది గ్రేడ్-1 సెక్రటరీలను, 11 మంది గ్రేడ్-2 సెక్రటరీలను, ఏడుగురు గ్రేడ్-3 సెక్రటరీలను, 46 మంది గ్రేడ్-4 సెక్రటరీలను.. మొత్తంగా 99 మందిని బదిలీ చేశారు. ఐదేళ్లుగా ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న సెక్రటరీలను కచ్చితంగా బదిలీ చేయాల్సి ఉండగా, కొందరికి మినహాయింపు ఇవ్వడం గమనించదగ్గ అంశం. ఐదేళ్లుగా ఒకే పంచాయతీలో పనిచేసిన వారిని సొంత మండలానికి బదిలీ చేయకూడదని ప్రభుత్వం

గందరగోళంగా..

ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొంది. ఈ నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి మరీ బదిలీలు జరిపారు. ఉదాహరణకు.. మచిలీపట్నం మండలం పోలాటితిప్ప పంచాయతీ సెక్రటరీ అసలు బదిలీ కోసం దరఖాస్తు చేసుకోకున్నా బదిలీ చేశారు. బదిలీ ప్రాంతం చెప్పకుండా అలాగే ఉంచారు. పొట్లపాలెం పంచాయతీ సెక్రటరీని పోలాటితిప్ప పంచాయతీకి బదిలీ మిగతా 4లో..

ఎంత పనిచేశావ్ నాన్నా..!

మైలవరంలో ఇద్దరు చిన్నారులను కడతేర్చిన తండ్రి

అప్పులు చేసిన తండ్రి ఆ బాధను పిల్లలపై చూపించాడు. హాస్టల్ నుంచి తల్లిదండ్రుల ఆప్యాయత కోసం వచ్చిన వారి ఆయుష్షు అంతలోనే తీసేశాడు. నిద్రలో ఉన్నవారిని శాశ్వతంగా నిద్రపోయేలా చేశాడు. ఆ తర్వాత ఆచూకీ లేకుండాపోయాడు. రెండు రోజుల్లో ఫాదర్స్ డే ఉండగా, మైలవరంలో అభంశుభం తెలియని ఇద్దరు చిన్నారులను కన్నతండ్రే కడతేర్చడం వెనుక కథ ప్రతి ఒక్కరి కంట నీరు తెప్పిస్తోంది.

- అప్పుల బాధలు తాళలేక గడ్డి మందు పెట్టి హత్య
- తాను కూడా చనిపోతున్నానని సూసైడ్ నోట్
- ఆనక కనిపించకుండా పోయిన తండ్రి
- ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని భావిస్తున్న పోలీసులు

విజయవాడ/మైలవరం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ రవిశంకర్.. మైలవరంలోని తిరువూరు రోడ్డులో ఉంటూ ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. ఆయన భార్య చంద్రిక ఉపాధి నిమిత్తం ఇటీవల బెహ్రెయిన్ వెళ్లింది. వీరికి లీలాసాయి (7), లక్ష్మీ హిరణ్య (9) పిల్లలు. జి.కొండూరులోని మిషనరీ హాస్టల్‌లో ఉంటూ ఐదు, మూడు తరగతులు చదువుతున్నారు. ఈ కుటుంబం తిరువూరు రోడ్డులో అద్దెకు ఉంటోంది. రెండు నెలల క్రితం చంద్రిక పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరంలోని పుట్టింటికి వెళ్లింది. అక్కడి నుంచి ఉపాధి కోసం బెహ్రెయిన్ వెళ్లింది. అప్పటి నుంచి రవిశంకర్ పిల్లలతో కలిసి ఉంటున్నాడు. వేసవి సెలవులు కావడంతో పిల్లలిద్దరూ హాస్టల్ నుంచి తండ్రి వద్దకు వచ్చారు. రవిశంకర్ కొద్దిరోజుల కిందటి వరకు తన



పిల్లలు లీలాసాయి, లక్ష్మీ హిరణ్యతో రవిశంకర్, చంద్రిక (ఫైల్)

తల్లిదండ్రులు అనిత, లక్ష్మీపతి కలిసి ఉండేవాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో తల్లిదండ్రులు దేవుని చెరువు వద్దకు అద్దెకు వెళ్లిపోయారు. లక్ష్మీపతి రోజూ తన కుమారుడి ఇంటికి వచ్చి వెళ్తుండేవాడు. ఈనెల 8వ తేదీన లక్ష్మీపతి యథావిధిగా కుమారుడు ఇంటికి వచ్చాడు. తాళాలు వేసి మిగతా 4లో..

పది సప్లిమెంటరీలో 5,108 మంది ఉత్తీర్ణత

విజయవాడ/మచిలీపట్నం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో ఉమ్మడి కృష్ణాజిల్లాలో 5,108 మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ ఫలితాలను విద్యాశాఖ గురువారం విడుదల చేసింది. ఎన్టీఆర్ జిల్లాలో 2,682 మంది బాలురు, 1,778 మంది బాలికలు మొత్తం 4,460 మంది పరీక్షలకు హాజరుకాగా, 1,791 మంది బాలురు, 1,325 మంది బాలికలు మొత్తం 3,116 మంది ఉత్తీర్ణులయ్యారు. 69.87 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

కృష్ణాజిల్లాలో 1,984 మంది బాలురు, 1,294 మంది బాలికలు మొత్తం 3,278 మంది పరీక్షలు రాయగా, 1,137 మంది బాలురు, 855 మంది బాలికలు మొత్తం 1,992 మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణత శాతం 60.77గా నమోదైంది.

'సిఫార్సు' భక్తులు టికెట్ కొనాల్సిందే..

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- దుర్గగుడి ఈవో శీనానాయక్

విజయవాడ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ దర్శనానికి ప్రొటోకాల్ జాబితాలో ఉన్నవారి సిఫార్సు లేఖలతో వచ్చిన భక్తులు కచ్చితంగా టికెట్ కొనాలని దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఈవో శీనానాయక్ స్పష్టం చేశారు. 'ఆంధ్రజ్యోతి'లో గురువారం ప్రచురితమైన 'ఇదేం పద్ధతి' కథనంపై ఆయన స్పందించారు. ప్రొటోకాల్ జాబితాలో ఉన్న వారికి మాత్రమే నిబంధనల ప్రకారం దర్శన ఏర్పాట్లు చేస్తామని, వారి సిఫార్సు లేఖలతో వచ్చేవారు మాత్రం తప్పనిసరిగా టికెట్లు కొనాలని స్పష్టం చేశారు. ఆ డబ్బు అమ్మవారి మూలధనానికి చేరుతుందని, ఈ విషయాన్ని భక్తులు గమనించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రాజధాని పనుల కోసం క్వారీల కేటాయింపు

ఆరు సంస్థలకు గన్నవరంలో లీజుకిస్తూ ఉత్తర్వులు

428 ఎకరాల్లో గ్రావెల్, మట్టి తవ్వకాలకు అనుమతి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రాజధాని అమరావతిలో వివిధ ప్రాజెక్టులను దక్కించుకున్న పలు నిర్మాణ సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం గన్నవరం నియోజకవర్గంలోని 428 ఎకరాల గ్రావెల్, మట్టి తవ్వకాలకు అనుమతులు ఇచ్చింది. సీఆర్‌డీఏ, ఏడీసీఎల్ ప్రతిపాదనల మేరకు నిర్మాణ సంస్థలకు గ్రావెల్ క్వారీలను నామినేషన్ విధానంలో అప్పగించేందుకు అంగీకరించింది. గన్నవరం నియోజకవర్గంలో గ్రావెల్, ఎర్రమట్టి సహజ వనరులు ఎక్కువగా ఉన్నాయి. ఇందులో భాగంగానే బీఎస్ఆర్ ఇన్ఫ్రాటెక్ ఇండియా లిమిటెడ్, మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్, ఆర్వీఆర్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఎన్‌సీసీ లిమిటెడ్, ఎల్అండ్‌టీ లిమిటెడ్, బీఎస్‌సీపీఎల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ వంటి మొత్తం ఆరు సంస్థలకు భారీగా క్వారీ లీజులను నామినేషన్ విధానంలో కేటాయించారు. బీఎస్ఆర్ ఇన్ఫ్రాటెక్‌కు అత్యధికంగా గన్నవరం మండలంలో నాలుగు క్వారీ లీజుకివ్వగా, పరిమాణం పరంగా మేఘా ఇంజనీరింగ్‌కు అత్యధికంగా క్వారీలు ఇచ్చారు. అత్యధికంగా మేఘాకు 120 ఎకరాలు, రెండో అత్యధికంగా బీఎస్ఆర్‌కు 115 ఎకరాలు అనుమతించారు. ఇవన్నీ పురుషోత్తపట్నం, కొండపావులూరు, వెదురుపావులూరు, గొల్లనపల్లి, గోపవరపుగూడెం గ్రామాల్లో ఉన్నాయి. కాగా, కేటాయింపులు జరిపిన సంస్థలు నిబంధనలకు అనుగుణంగా తవ్వకాలు జరిపేలా గనుల శాఖ, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

మరొకరు అరెస్టు

- ఎండీఎంఏ కేసులో పామర్రుకు చెందిన వ్యక్తి అరెస్టు
- పరారీలో కీలక నిందితులు

విజయవాడ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీ నుంచి కొరియర్ సర్వీసు ద్వారా ఎండీఎంఏ డ్రగ్‌ను తీసుకొచ్చిన కేసులో మరో నిందితుడికి ఇటీవల పోలీసులు సంకెళ్లు వేశారు. పామర్రు మండలానికి చెందిన మనోహర్ అనే నిందితుడ్ని టాస్క్‌ఫోర్స్ పటమట పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు నిందితులను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. పెనమలూరు మండలం సనత్‌నగర్‌కు చెందిన తిరుమలశెట్టి జీవన్‌కుమార్, ఫన్‌టైమ్స్ క్లబ్ వీధికి చెందిన బొంతు నితీష్ కుమార్, యనమలకుదురుకు చెందిన తూలిమెల్లి తరుణ్‌ప్రసాద్‌ను అరెస్టు మిగతా 4లో..

ఎండీయూ వాహనాలు ఫర్ సేల్

- ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన వాహనాలు ఓఎల్ఎక్స్‌లో ప్రత్యక్షం
- రూ.3-4 లక్షలకు పోస్టులు పెడుతున్న ఎండీయూ ఆపరేటర్లు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన పలువురు మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ) ఆపరేటర్లు ఆ వాహనాలను అమ్మకానికి పెట్టారు. సెకండ్‌హ్యాండ్ వస్తువుల సేల్స్ నిర్వహించే ఓఎల్ఎక్స్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలో సెకండ్ సేల్స్ కింద వీటిని విక్రయిస్తున్నారు. ఓఎల్ఎక్స్ వెబ్‌సైట్, మొబైల్ యాప్స్‌లో ఫ్రీ రిజిస్ట్రేషన్ చేసుకుని ఉచిత యాడ్స్ పోస్ట్ చేసే అవకాశాన్ని ఉపయోగించుకుని మరీ అమ్మకానికి పెడుతున్నారు. ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఇద్దరు మిగతా 4లో..

అపరిపక్వ దశలో కోర్టును ఆశ్రయించారు

- పేర్ని నాని, ఆయన కుమారుడిపై కేసు నమోదు కాలేదుగా!
- నకిలీ ఇళ్ల పట్టాల పంపిణీ వివరాలు ఇవ్వండి
- రెవెన్యూ ఉన్నతాధికారులకు హైకోర్టు ఆదేశం

4

1933 మంది టీచర్లకు బదిలీలు

- కౌన్సెలింగ్‌ను పరిశీలించిన ఆర్‌జేడీ నాగమణి

కారు, లారీ ఢీ

ఒకరి మృతి, మరొకరికి గాయాలు

అపరిపక్వ దశలో
కోర్టును ఆశ్రయించారు

- పేర్ని నాని, ఆయన కుమారుడిపై కేసు నమోదు కాలేదుగా!
- నకిలీ ఇళ్ల పట్టాల పంపిణీ వివరాలు ఇవ్వండి
- రెవెన్యూ ఉన్నతాధికారులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ఫోర్జరీ సంతకాలతో నకిలీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేశామంటూ... పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా తమపై కేసులు పెట్టబోతున్నారంటూ వైసీపీ నేత పేర్ని వెంకట రామయ్య (నాని), కుమారుడు సాయి కృష్ణమూర్తి వేసిన పిటిషన్‌పై గురువారం హైకోర్టు విచారణ జరిపింది. పిటిషనర్లపై ఇప్పటివరకు ఎలాంటి కేసు నమోదు కాలేదని గుర్తు చేసింది. అపరిపక్వ దశలో కోర్టును ఆశ్రయించారని వ్యాఖ్యానించింది. పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా కోర్టును ఎలా ఆశ్రయిస్తారని ప్రశ్నించింది. నకిలీ పట్టాల పంపిణీ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలను తమ ముందు ఉంచాలని రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించింది. తొందరపాటు చర్యలు తీసుకోకుండా పోలీసులను నిలువరించాలన్న పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాది అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది. విచారణను జూన్ 16కి వాయిదా వేసింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టీసీడీ శేఖర్ గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. 2024 ఎన్నికల సందర్భంగా మచిలీపట్నంలో ఫోర్జరీ సంతకాలతో నకిలీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారంటూ పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా తమపై కేసులు పెట్టబోతున్నారంటూ పేర్ని నాని, ఆయన కుమారుడు కృష్ణమూర్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సరైన విచారణ లేకుండా, తమ వాదన చెప్పుకొనే అవకాశం ఇవ్వకుండా.. తమపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోకుండా రెవెన్యూ, పోలీసు అధికారులను నిలువరించాలని వ్యాజ్యంలో కోరారు. ఈ వ్యాజ్యం గురువారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది సి.రఘు వాదనలు వినిపించారు. ఇళ్ల పట్టాల పంపిణీకి తహశీల్దారే బాధ్యులు అన్నారు. పత్రికతో వచ్చిన కథనం ఆధారంగా పిటిషనర్లను కేసులో ఇరికించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఎఫ్ఐఆర్ నమోదుకు పోలీసులు సిద్ధమౌతున్నట్లు వార్తలు ప్రచురిస్తున్నారన్నారు. పిటిషనర్‌పై రాజకీయ కక్షసాధింపునకు పాల్పడుతున్నారని తెలిపారు. అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ... నకిలీ ఇళ్ల పట్టాల పంపిణీపై విచారణ కొనసాగుతోందన్నారు. కేవలం ఆందోళనతో పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారన్నారు. ఈ వాదనల్ని పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తి దీనికి సంబంధించిన వివరాలు సమర్పించాలని రెవెన్యూ ఉన్నతాధికారులను ఆదేశిస్తూ విచారణను వాయిదా వేశారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జైన కారు

కారు, లారీ ఢీ.. ఒకరి మృతి

- భార్యకు తీవ్రగాయాలు.. నుజ్జునుజ్జైన కారు
- స్వల్పగాయాలతో బయటపడిన కుమారుడు, కుమార్తె



కృత్తివెన్ను, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం మధ్యాహ్నం సంగమూడి గ్రామం వద్ద చోటుచేసుకుంది. ఎస్సై పైడిబాబు తెలిపిన వివరాల ప్రకారం పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన కుంపట్ల రామ్‌గోపాల్ (41) కుటుంబంతో కలిసి హైదరబాద్‌లోని బంధువుల పెళ్లికి వెళ్లి తిరగి వస్తుండగా, సంగమూడి వద్ద ఎదురుగా వస్తున్న లారీని ప్రమాదవశాత్తు బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రామ్‌గోపాల్ అక్కడికక్కడే మృతి చెందగా, భార్య రీతుకు తీవ్ర గాయాలయ్యాయి. కుమారుడు వేదాంత్ శ్రీ రామాంజనేయులకు చిన్న చిన్న గాయాలయ్యాయి. కుమార్తెకు ఎలాంటి గాయాలు కాకుండా సురక్షితంగా బయటపడింది. ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయ్యింది. సమాచారం అందుకున్న పోలీసులు తక్షణమే సంఘటన స్థలానికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు. భార్య, కుమారుడిని అంబులెన్స్‌లో భీమవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. రామ్ గోపాల్ మృతదేహం కారులో ఇరుక్కుపోగా, స్థానికుల సాయంతో పోలీసులు సుమారు 2 గంటలు కష్టపడి, బయటకు తీసి మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి సోదరుడు రాంప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పైడిబాబు తెలిపారు.

సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చాం:కొల్లు

మచిలీపట్నం టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలో ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. టీడీపీ మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయం వద్ద గురువారం సుపరిపాలనకు ఏడాది ఏడాది కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మంత్రి రవీంద్ర మాట్లాడుతూ, టీడీపీ హయాంలోనే పోర్టు పూర్తి చేస్తున్నామని, షిపింగ్ యార్డు నిర్మాణం పూర్తవుతుందన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. సీనియర్ టీడీపీ నేత గొర్రెపాటి గోపీచంద్, టీడీపీ నగరాధ్యక్షుడు లోగిశెట్టి వెంకటస్వామి, కార్యదర్శి బచ్చుల అనిల్ కుమార్, మోటమర్రి బాబాప్రసాద్, కుంచే నాని, కాగిత వెంకటేశ్వరరావు, గోకుల శివ, ఎండి ఇలియాస్ పాషా, లంకిశెట్టి నీరజ, పాలపర్తి పద్మజ, పి.వి.ఫణికుమార్, పిప్పళ్ళ కాంతారావు, మాదివాడ రాము, బెరాకా అధినేత కిరణ్‌పాల్ తదితరులు పాల్గొన్నారు. రామానాయుడుపేటలోని వినాయక స్వామి ఆలయం వద్ద తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు హసీం బేగ్ ఆధ్వర్యంలో కేకు కట్ చేశారు. స్వీట్లు, మజ్జిగ పంపిణీ చేశారు. విజన్ ఇన్‌చార్జి మంచాల రాంబాబు, తెలుగు యువత ప్రతినిధులు మోటుపల్లి దుర్గాశరత్, వేమూరి నాగ సాయి తదితరులు పాల్గొన్నారు.



డంపింగ్ యార్డు వద్ద చెత్త క్రషింగ్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

చెత్త నుంచి సంపద సృష్టికి ప్రాధాన్యం

చెత్త నుంచి సంపద సృష్టించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నం రాజుపేటలో డంపింగ్ యార్డు వల్ల ఏర్పడిన కష్టాలను తొలగించేందుకు డంపింగ్ క్రషింగ్ యూనిట్‌ను ఆయన ప్రారంభించారు. మంత్రి రవీంద్ర మాట్లాడుతూ, స్వచ్ఛ బందరు కార్యక్రమంలో భాగంగా నగరాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. గత ఏడాది అక్టోబరు 2న సీఎం చంద్రబాబు నాయుడు డంపింగ్ యార్డును సందర్శించారని, ఆ సందర్భంగా ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారన్నారు. రూ.3.75 లక్షలతో తరుణి అసోసియేట్స్‌కు సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహణ బాధ్యతలు అప్పగించారన్నారు. చెత్త నుంచి విద్యుత్ తయారు చేసే ప్లాంటు ఏర్పాటు చేసేందుకు ఆలోచిస్తున్నామన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, టీడీపీ నాయకులు మోటమర్రి బాబాప్రసాద్, లోగిశెట్టి వెంకటస్వామి, బచ్చుల అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

1933 మంది టీచర్లకు బదిలీలు

మచిలీపట్నం టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణాజిల్లాలోని సెకండరీగ్రేడు టీచర్ల బదిలీలు 3వ రోజున గురువారం రెండు సమావేశపు హాళ్లలో కొనసాగాయి. జడ్పీ సమావేశపు హాలులో కృష్ణాజిల్లా డీఈవో జీవీజీ రామారావు, డీఈవో కార్యాలయం సమావేశపు హాలులో ఎన్టీఆర్ జిల్లా డీఈవో యూవీ సుబ్బారావు ఈ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ రెండు హాళ్లల్లో 803 మంది సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీల కౌన్సెలింగ్ జరిగింది. ఇంకా 847 మంది టీచర్లకు చేపట్టాల్సి ఉండగా శుక్రవారం వీరికి కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. 8 ఏళ్లు ఒకే పాఠశాలలో పనిచేస్తున్న ప్రభుత్వ, మండల పరిషత్, మునిసిపల్ పాఠశాలలకు చెందిన టీచర్లు ఈ కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారు. అలాగే రిక్వెస్ట్ ట్రాన్సఫర్ కోసం దరఖాస్తు చేసుకున్న ఎస్‌జీటీలు కూడా హాజరయ్యారు. ఈ కౌన్సిలింగ్ ప్రక్రియను ఆర్‌జేడీ నాగమణి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధ్యాయ సంఘాల నేతలతో మాట్లాడారు. బదిలీ ఉత్తర్వులు తీసుకున్న ఉపాధ్యాయులు తాము కోరుకున్న పాఠశాలల్లో వెంటనే చేరాలన్నారు. ఉపాధాయులు కోరినట్టు ప్రభుత్వం సెకండరీ గ్రేడ్ టీచర్లకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తోందన్నారు.

- కౌన్సెలింగ్‌ను పరిశీలించిన ఆర్‌జేడీ



9 రకాల పాఠశాలలను నిర్వహించాలి

విద్యార్థులకు నాణ్యత గల విద్యను అందిచాలనే లక్ష్యంతో రాష్ట్రంలోని పాఠశాలలను 9 విధాలుగా విభజించామని విద్యాశాఖ కాకినాడ రీజినల్ డైరక్టర్ జీ నాగమణి పేర్కొన్నారు. గురువారం మచిలీపట్నం డీఈవో కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. పాఠశాలలు పునఃప్రారంభమైన దృష్ట్యా పదోన్నతులు, బదిలీలు పొందిన ఉపాధ్యాయులు తమకు కేటాయించిన పాఠశాలలో విద్యా కార్యక్రమాలు కొనసాగించాలన్నారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన విద్యా విధానాన్ని అవలంబించాలన్నారు. డీవైఈవోలు, ఎంఈవోలు ఈ నూతా విద్యా విధానాన్ని, పాఠశాలలపై విద్యార్థుల తల్లితండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులకు యూనిఫాంతో పాటు కిట్లు అందజేశామన్నారు. మధ్యాహ్న భోజన పథకానికి నాణ్యత గల బియ్యం అందించామని, టీచర్లకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెరిగేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. డీఈవో పీవీజే రామారావు, ఎన్టీఆర్ డీఈవో యూవీ సుబ్బారావు పాల్గొన్నారు.

టీచర్లకు శిక్షణ తరగతులు 16 నుంచి : కుమిదినీ సింగ్

విద్యా ప్రమాణాలు పెంపొందించే లక్ష్యంతో ఉపాధ్యాయులకు ఈనెల 16 నుంచి మచిలీపట్నం హిందూ కళాశాల ఆడిటోరియంలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు సమగ్ర శిక్ష ఏపీసీ కుమిదిని సింగ్ తెలిపారు. బందరు ఎంఈవో కార్యాలయాన్ని గురువారం ఆమె సందర్శించారు. ఎనిమిది రోజుల పాటు 503 మంది ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇస్తామన్నారు. ఎంఈవోలు దుర్గాప్రసాద్, గురుప్రసాద్ పాల్గొన్నారు.

మంగళగిరి ఎయిమ్స్‌లో
కేన్సర్ సెంటర్ ఏర్పాటు చేయాలి

- ఎంపీ వల్లభనేని బాలశౌరి



కేంద్ర వైద్య,కుటుంబ సంక్షేమశాఖ సెక్రటరీ పుణ్యశ్రీవాత్సవ, జాయింట్ సెక్రటరీ అంకితామిశ్రా బుందేలాతో మాట్లాడుతున్న ఎంపీ వల్లభనేని బాలశౌరి

మచిలీపట్నం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కేన్సర్ బాధితులు పెరుగుతున్న నేపథ్యంలో మంగళగిరి ఎయిమ్స్‌లో కేన్సర్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని మచిలీపట్నం ఎంపీ, మంగళగిరి ఎయిమ్స్ డైరెక్టర్ వల్లభనేని బాలశౌరి ప్రతిపాదన చేశారు. మంగళగిరి ఎయిమ్స్‌ను అభివృద్ధి చేసే అంశంపై ఢిల్లీలో కేంద్ర వైద్య, కుటుంబ సంక్షేమశాఖ సెక్రటరీ పుణ్యశ్రీవాత్సవ, జాయింట్ సెక్రటరీ అంకితామిశ్రా బుందేలాతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. మంగళగిరి ఎయిమ్స్ జాతీయరహదారి పక్కనే ఉందని, రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర వైద్యసేవలందించేందుకు ట్రామాకేర్‌ను కూడా ఏర్పాటు చేయాలన్నారు. కేన్సర్ బాధితులు పెరుగుతున్న నేపథ్యంలో ఇక్కడ కేన్సర్‌సెంటర్‌ను అందుబాటులోకి తెచ్చి మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. మంగళగిరి ఎయిమ్స్‌లో ఇప్పటివరకు 25 లక్షల మంది వివిధ రకాల వైద్యసేవలు పొందారని, ఈ ఆసుపత్రిలో అన్ని రకాల వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చేందుకు వైద్యులు, సిబ్బంది సంఖ్యను మరింతగా పెంచాలని కోరారు. ఎంపీ సూచనల మేరకు మంగళగిరి ఎయిమ్స్‌లో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

ఆహారసంస్థలు నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ఆహారసంస్థలు కల్తీని నివారించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ, ఫుడ్‌సేఫ్టీ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారుల సమావేశం గురువారం ఢిల్లీలో జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఎంపీ మాట్లాడుతూ వినియోగదారుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఆహారసంస్థలు హానికరమైన పదార్థాలను వాడకుండా నిఘా ఉంచాలన్నారు. ఫుడ్‌సేఫ్టీ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రమాణాలకు అనుగుణంగా ఆహారపదార్థాల తయారీలో రంగులు ఉండాలన్నారు. ఆహారపదార్థాల లేబుల్స్‌పై తప్పుడు సమాచారం ముద్రించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆహారపదార్థాలు తయాచేసే ప్రాంతాల్లో, రవాణాలో కార్మికులు వక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ సీఈవో కమలవర్ధనరావు, కేంద్ర వైద్య, కుటుంబ సంక్షేమశాఖ సెక్రటరీ కుమారి పుణ్య శ్రీవాత్సవ, జాయింట్ కలెక్టర్ అంకితా మిశ్రా బుందేలా, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న ఎన్డీయే కూటమి నాయకులు

స్వర్ణాంధ్ర విజన్ 2047 ముఖ్యమంత్రి కల

- ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

ప్రసాదంపాడు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర విజన్-2047 ముఖ్యమంత్రి చంద్రబాబు కల అని, శక్తివంతమైన, సమగ్రాభివృద్ధితో ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి రూపొందించిన ప్రణాళికని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. గురువారం నిడమానూరు టీడీపీ కార్యాలయం వద్ద ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా "సుపరిపాలనకు ఏడాది" అనే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేలు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, గురజాల జగన్మోహన్ హాజరయ్యారు. పార్టీ కార్యాలయం నుంచి నిడమానూరు సెంటర్ వరకు బైక్‌పై ర్యాలీగా వెళ్లారు. బాణాసంచా కాలుస్తూ కూటమి పార్టీల కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. అనంతరం కేక్ కట్ చేసి ఎన్డీఏ కూటమి నేతలు, కార్యకర్తలు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో మరో రెండు ఎస్ఈజెడ్‌లను నెలకొల్పేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. పారిశ్రామిక అభివృద్ధితోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమన్నారు. అవకాశాలను అభివృద్ధిగా మలిచేందుకు స్థానిక ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. గత వైసీపీ ప్రభుత్వంలో కనీసం తట్టమట్టి వేసిన దాఖలాలు లేవని, రహదారులన్నీ గుంతలమయం చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన రహదారులకు మరమ్మతు పనులు చేపట్టి గుంతలు లేని రహదారులను తయారు చేశామని వెల్లడించారు. జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఫణి కుమార్, టీడీపీ నేతలు గొడ్డల చిన్న రామారావు, కోనేరు సందీప్, పరుచూరి నరేష్, సర్నాల బాలాజీ, గూడవల్లి నరసింహారావు, కొల్లా ఆనంద్, ఎన్డీయే కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దుర్గగుడిలో ఏఈఓలు, అధికారులకు విధుల కేటాయింపు

ఇంద్రకీలాద్రి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన, ఇక్కడ పనిచేస్తున్న ఏఈఓలు, ఇతర అధికారులకు గురువారం విధులు కేటాయిస్తూ ఈవో వీకే శీనానాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. అసిస్టెంట్ కమిషనర్, ఈవో సీహెచ్ రంగారావుకు సీవీ రెడ్డి చారిటీస్, భూములు, లీజులు, న్యాయ సంబంధిత వ్యవహారాలు, ఆర్టీఏ యాక్ట్ కేటాయించారు. ఏఈవో బీవీ రెడ్డికి అన్నదానం, వేదపాఠశాల, వసతి గృహాలు అప్పగించారు. ఎన్.రమేష్ బాబుకు ప్రధాన ఆలయం, ప్రోటోకాల్, సరుకుల గోడౌన్, పండుగలు, పూజలు, ట్రస్ట్‌బోర్డు, ఉపాలయాలు, ఎం.వి.ఫామ్స్, స్టేషనరీ కేటాయించారు. పి.చంద్రశేఖర్‌కు రెలిజియస్, సెక్యులర్ పరిపాలన, లీగల్ సర్వీస్ అంశాలు, కౌంటర్ల సూపర్‌విజన్, డిస్‌ప్యాచ్, ఆల్ సెక్యూరిటీ, శానిటేషన్ అప్పగించారు. మెడికల్ లీవులో ఉన్న సుధారాణికి ఆడిట్, చీరల విభాగం, ఫస్ట్ ఎయిడ్ సెంటర్, సాధారణ అంశాలు, ఇతరత్రా కేటాయించారు. ఏఈఓ ఎం.ఎస్. ఎల్.శ్రీనివాస్‌కు అకౌంట్స్, ఐటీ, జీఎస్టీ రిటర్న్స్, ప్రూఫ్‌టీలు, ప్రసాదాల తయారీ విభాగాలు కేటాయించారు. ఏఈఓ ఎం.తిరుమలేశ్వరరావుకు కేశఖండన శాల, దత్తత ఆలయాలు, దుర్గాఘాట్ ఓవరాల్ పర్యవేక్షణ, కనకదుర్గానగర్‌లోని అన్ని అంశాలు, దుర్గాఘాట్‌లో హారతులు వంటివి కేటాయించారు. ఏఈఓ కేడర్‌లో ఉన్న కె.గంగాధర్‌కు కనకదుర్గ ప్రభ ఎడిటర్‌గా, పిఆర్ఓ, ధర్మపథం, ప్రభుత్వ పథకాల సమన్వయం, ఫీడ్ బ్యాక్ కౌంటర్ల పర్యవేక్షణ, భక్తుల నుంచి అభిప్రాయాలు తీసుకుని మంచి ఫలితాల కోసం పర్యవేక్షణకు అప్పగించారు. అలాగే సూపరింటెండెంట్‌లకు విధులను కేటాయించారు.

ఈవో ఆకస్మిక తనిఖీలు

ఇంద్రకీలాద్రి: దుర్గామల్లేశ్వర దేవస్థానం ఈవో వీకే శీనానాయక్ పలు విభాగాలలో తనిఖీలు చేశారు. లోపాలను గుర్తించి, భక్తుల ఇబ్బందులను గమనించి, ఆయా విభాగాల అధికారులకు పలు సూచనలు చేశారు. గురువారం ఈవో ఆకస్మికంగా అర్జునవీధిలో ఉన్న శృంగేరి మఠంలోని అన్నదాన విభాగాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటశాల శుభ్రతను పరిశీలించారు. వంటశాల అపరిశుభ్రంగా ఉండటంతో సూపరింటెండెంట్, గుమాస్తాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి నోటీసులు జారీ చేసినట్టు తెలిసింది.



అన్నదాన విభాగంలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఈవో

చినగొల్లపాలెం దీవిని కాపాడాలి

- ప్రభుత్వానికి వేదవ్యాస్ విజ్ఞప్తి



కృత్తివెన్ను, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సముద్ర కోతకు గురౌతున్న చినగొల్లపాలెం దీవిని కాపాడాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్ కోరారు. చినగొల్లపాలెం దీవిలో గురువారం వేదవ్యాస్ పర్యటించిన సముద్ర కోతకు గురౌతున్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 10 వేల మంది జనాభా, ఏడు వేల మంది ఓటర్లు ఉన్న దీవి ప్రమాదకర పరిస్థితుల్లో సముద్ర గర్భంలో కలిసిపోతుందన్నారు. తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై ఆలోచన చేసి, తగు చర్యలు చేపట్టాలని కోరారు. గతంలో 1990లో, 2004లో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నాటి ముఖ్యమంత్రులతో మాట్లాడి, ఏడు కిలోమీటర్ల మేర డ్రెడ్జింగ్ చేయించి, సముద్ర ముఖ ద్వారాన్ని తెరిపించామన్నారు. ప్రస్తుత పరిస్థితులు స్థానిక శాసన సభ్యులు, పార్లమెంటు సభ్యులు దీవి పరిస్థితిని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లా లని కోరారు. తాను కూడ స్వయంగా వారిని కలిసి తగు చర్యలు తీసుకొనేలా ప్రయత్నిస్తానని తెలిపారు.

మరొకరు అరెస్టు

(3వ పేజీ తరువాయి)

చేశారు. వారి నుంచి 33 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్ స్వాధీనం చేసుకున్నారు. తనతో పాటు ఇంటర్మీడియెట్ వరకు చదువుకున్న నూజివీడుకు చెందిన మనోహర్ అనే యువకుడు ఈ డ్రగ్‌ను అలవాటు చేసినట్టు జీవన్‌కుమార్ పోలీసులకు చెప్పాడు. పామర్రు మండలం జమీగొల్వేపల్లికి చెందిన మనోహర్‌కు నూజివీడుకు చెందిన యువతితో కొన్నాళ్ల క్రితం వివాహమైంది. ఇద్దరూ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. మనోహర్ బీటెక్‌తో పాటు ఎంబీఏ పూర్తిచేశాడు. ఇతను పలు సోలార్ ప్రాజెక్టులను తయారు చేసినట్టు పోలీసులు గుర్తించారు. ఛత్తీస్‌గడ్‌లో స్నేహితుడితో కలిసి ఎలక్ట్రికల్ కాంట్రాక్ట్ పనులు చేస్తున్నాడు. కారులో హైదరాబాద్ నుంచి పామర్రుకు వస్తుండగా మనోహర్‌ను పట్టుకున్నారు. తనకు ఎండీఎంఏ డ్రగ్‌తో ఎలాంటి సంబంధం లేదని మనోహర్ పోలీసు విచారణలో చెప్పినట్టు సమాచారం. ఈ డ్రగ్‌ను జీవన్‌కుమార్ రుచి చూపించాడని వాంగ్మూలం ఇచ్చినట్టు తెలిసింది. ప్రస్తుతం మనోహర్ విచారణ కొనసాగుతోంది. కాగా, జీవన్‌కుమార్ నుంచి క్యూఆర్ కోడ్ స్కానర్ ద్వారా డబ్బు తీసుకున్న బందోపాధ్యాయ చౌదరి, ఎండీఎంఏ సరుకును పంపిన రింకూ పరారీలో ఉన్నారు. జీవన్‌కుమార్ గ్యాంగ్ చిక్కగానే వారు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. వారికోసం ప్రత్యేకబృందాలు గాలిస్తున్నాయి.

ఎండీయూ వాహనాలు ఫర్ సేల్

(3వ పేజీ తరువాయి)

ఎండీయూ ఆపరేటర్లు ఇప్పటికే ఓఎల్ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఒక వాహనాన్ని రూ.3 లక్షల సేల్‌తో పోస్ట్ చేయడం గమనార్హం.

ప్రభుత్వ ఆదేశాలు లేకుండా..

కూటమి ప్రభుత్వం ఎండీయూ వాహనాల ద్వారా డోర్ డెలివరీని రద్దు చేసిన సంగతి తెలిసిందే. అయితే, ఆ వాహనాలను ఎండీయూ ఆపరేటర్లకే ఇచ్చేయాలన్నది ప్రభుత్వ ఆలోచన. గతంలో వారు తీసుకున్న రుణాన్ని కూడా ప్రభుత్వమే చెల్లించాలన్న ఆలోచన కూడా చేస్తోంది. కానీ, ప్రభుత్వం సర్క్యులర్ ఇవ్వకుండా ఇలా వాహనాలను విక్రయించవచ్చా లేదా అన్నది ప్రశ్నార్థకంగా ఉంది. ప్రభుత్వం రుణాన్ని చెల్లిస్తానంటోంది కాబట్టి.. ఆ వాహనాలన్నీ ఎండీయూ ఆపరేటర్ల సొంతమవుతాయి. కాబట్టి ఆ వాహనాలను వారేమైనా చేసుకునే అవకాశం ఉంటుంది. కానీ, ప్రభుత్వ ఆదేశాలు లేకుండా వాటి విక్రయాలు జరిగితే కొనుగోలు చేసిన వారికి రిజిస్ట్రేషన్ ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది.

బదిలీ బేరాలు

(3వ పేజీ తరువాయి)

చేశారు. ఈ విషయంపై పోలాటితిప్ప సెక్రటరీ అధికారులను ఆశ్రయించగా, వేరే పంచాయతీకి బదిలీచేసే అంశాన్ని మరిచిపోయామని, దరఖాస్తు చేసుకుంటే ఏదో ఒక పంచాయతీకి పంపిస్తామని చెప్పడం గమనార్హం. పొట్లపాలెం పంచాయతీలో ఐదేళ్లుగా పనిచేస్తున్న కార్యదర్శిని వేరే మండలానికి బదిలీ చేయాల్సి ఉండగా, ఏవేవో కారణాలు చేసి అదే మండలంలోని వేరే పంచాయతీకి బదిలీ చేశారు. మచిలీపట్నం మండలం చినకరగ్రహారం పంచాయతీలో ఐదేళ్లుగా పనిచేస్తున్న సెక్రటరీని గరాలదిబ్బ పంచాయతీకి బదిలీ చేశారు. ఈ సెక్రటరీని ప్రస్తుతం జరిగిన బదిలీలో వేరే మండలానికి బదిలీ చేయాల్సి ఉన్నా నిబంధనలు పాటించలేదు.

అధికారుల తీరుపై విమర్శలు

డీపీవో కార్యాలయంలో పనిచేసే అధికారులు తమకు అనుకూలమైన ఉద్యోగులతో ఒక ముఠాను ఏర్పాటు చేసుకున్నారని పంచాయతీ కార్యదర్శులు చెప్పుకొంటున్నారు. అధికారులు పంచాయతీల పరిశీలన కోసం వస్తే.. పెద్ద పంచాయతీల్లో పనిచేసే కార్యదర్శులకు ముందే ఈ ముఠా సమాచారం చేరవేసి, ఇంత నగదు ఇచ్చి పంపాలని చెబుతుందన్న ఆరోపణలు వస్తున్నాయి. డీపీవో కార్యాలయంలో అన్ని పనులు తానే చూస్తున్నట్టుగా హంగామా చేసే ఉద్యోగి ఒకరు, ఓ అడుగు ముందుకేసి అధికారుల పేరుచెప్పి పంచాయతీ కార్యదర్శుల నుంచి నగదు వసూళ్లకు పాల్పడుతున్నారని బాహాటంగానే చెప్పుకొంటున్నారు. మచిలీపట్నం సౌత్ మండలంలోని పెద్ద పంచాయతీలో పనిచేస్తూ పలు అక్రమాలకు పాల్పడుతున్న ఈ పంచాయతీ కార్యదర్శి పనితీరుపై విచారణ జరపాలని గ్రామస్తులు గత సోమవారం ప్రజాసమస్యల పరిష్కారవేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

ఎంత పనిచేశావ్ నాన్నా..!

(3వ పేజీ తరువాయి)

ఉండటంతో తిరిగి వెళ్లిపోయాడు. ఇలా వచ్చిన ప్రతిసారీ ఇంటికి తాళాలు వేసి ఉంటున్నాయి. గురువారం మళ్లీ కుమారుడి ఇంటికి వచ్చాడు. రవిశంకర్ ఉపయోగించే సైకిల్ ఆరు బయట ఉండటంతో ఎండ, వానకు పాడైపోతుందని వరండాల్లో పెట్టాడు. వరండాలోకి వెళ్లగానే, దుర్వాసన వచ్చింది. ఏదో జంతువు చనిపోయి ఉంటుందని భావించిన లక్ష్మీపతి కిటికీకి అడ్డుగా కట్టిన కర్టెన్ తీసి చూడగా లక్ష్మీహిరణ్య, లీలాసాయి మంచంపై విగతజీవులుగా పడి ఉన్నారు. లక్ష్మీపతి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించగా, వరండాలో స్టూల్‌పై గడ్డి మందు సీసా కనిపించింది. దీన్నిబట్టి రవిశంకర్ పిల్లలిద్దరికీ డ్రింక్‌లో గానీ, భోజనంలో గానీ గడ్డి మందు కలిపి ఇచ్చినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ తర్వాత ఇంటికి తాళం వేసి వెళ్లిపోయినట్టు భావిస్తున్నారు. రవిశంకర్ ఫోన్ స్విచ్ఛాఫ్ అని వస్తోంది.

అప్పులే కారణమా?

రవిశంకర్‌కు అప్పులు ఉన్నాయని తండ్రి లక్ష్మీపతి చెబుతున్నాడు. అతను పనిచేసే హోటల్ వద్ద విచారణ చేయగా, వారం రోజులుగా రావట్లేదని చెప్పారు. క్లూస్ టీం ఇంట్లో పరిశీలించగా, ఆత్మహత్య చేసుకుంటున్నట్టు రవిశంకర్ రాసిన లేఖ లభించింది. 'నాతోపాటు అందరినీ తీసుకెళ్తాను. నాకు చాలా అప్పులు ఉన్నాయి' అని అందులో రాశాడు. దీన్నిబట్టి ముందుగా పిల్లలిద్దరినీ చంపేసి, ఆ తర్వాత అతడూ ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. రవిశంకర్ తల్లిదండ్రులతో మాట్లాడినప్పుడు, ఇతరులతో మాట్లాడినప్పుడు పదేపదే అప్పుల గురించి ప్రస్తావించేవాడు. ఆ అప్పులు ఎందుకు చేశాడో, అప్పు చేసిన డబ్బు ఎక్కడ ఉపయోగించాడో చెప్పేవాడు కాదు. అసలు అప్పులెంత ఉన్నాయో ఏనాడూ చెప్పలేదని తండ్రి లక్ష్మీపతి చెబుతున్నాడు. ఉపాధి కోసం భార్య చంద్రికను బెహ్రాన్ పంపడానికి ఈ అప్పులు చేశాడా.. అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అసలు రవిశంకర్‌కు ఎవరెవరు అప్పులు ఇచ్చారన్న దానిపై కూపీ లాగుతున్నారు. అలాగే, రవిశంకర్ తల్లి అనితకు, భార్య చంద్రికకు మధ్య నిత్యం గొడవలు జరుగుతుండేవి. అత్తాకోడళ్లకు ఏ విషయంలోనూ పడేది కాదని లక్ష్మీపతి మాటల ద్వారా తెలుస్తోంది. అలాగే, భార్య అనిత పోరు భరించలేక కొద్దిరోజుల క్రితం లక్ష్మీపతి ఇంటి నుంచి వెళ్లిపోయినట్టు తెలిసింది. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైనట్టు స్థానికులు చెబుతున్నారు.

నాన్నమ్మ, తాతయ్య ఉండి ఉంటే..

ఏడాదిలో నగానికిపైగా జి.కొండూరులోని మిషనరీ హాస్టల్‌లో ఉండే లీలాసాయి, లక్ష్మీ హిరణ్యను తాతయ్య లక్ష్మీపతి, నానమ్మ అనిత గారాబంగా చూసేవారు. వారు ఉండి ఉంటే.. ఆ చిన్నారులిద్దరూ ప్రాణాలతో ఉండేవారని చుట్టుపక్కల వారు చెప్పారు. కిటికీలో నుంచి లక్ష్మీపతి చూడగా, పిల్లలిద్దరూ మంచంపై పురుగులు పట్టి కనిపించడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకున్నారు. విగతజీవులుగా ఉన్న మనవడు, మనవరాలిని చూసి కన్నీరుమున్నీరయ్యారు. కాగా, ఇప్పటి వరకు రవిశంకర్ ఆచూకీ లభించలేదు. దీనిపై మైలవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	116, 125, 136
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 535

ట్యాలీ కోర్సులో ఉచిత శిక్షణ

ఉంగుటూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ఆత్కూరు స్వర్ణభారత్‌ట్రస్ట్‌లో డాక్టర్ బీవీ రాజు ఫౌండేషన్, శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంప్యూటర్ శిక్షణా కేంద్రంలో కంప్యూటరైజ్డ్ ఎకౌంటింగ్ విత్ టాలీ కోర్సులో జూలై 7 నుంచి ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు సంస్థ ఇన్‌చార్జి జి.అంకమ్మరావు తెలిపారు. బీకామ్/ఎంకామ్/బీబీఏ/ఎంబీఏ చదివి 18 నుంచి 35 సం వత్సరాల యువతీ యువకులు అర్హులని తెలిపారు. కోర్సు కాలవ్యవధి 60 రోజులు ఉంటుందని, శిక్షణాకాలంలో అభ్యర్థులకు శిక్షణతోపాటు భోజన, వసతి సదుపాయాలు పూర్తిగా ఉచితమని పేర్కొన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందడంలో సంస్థ పూర్తి సహాయ, సహకారాలు అందిస్తుందన్నారు. వివరాలకు 9100033552, 9346607845 నెంబర్లలో సంప్రదించాలని అంకమ్మరావు సూచించారు.

గుర్రపు డెక్క నిర్మూలనకు రసాయనాల పిచికారీ

ఉయ్యూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : అప్పర్ పుల్లేరుకాల్వలో పేరుకుపోయిన గుర్రపుడెక్క నిర్మూలనకు ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. కంకిపాడు సెక్షన్ పరిధిలో కంకిపాడు నుంచి ఉయ్యూరు వరకు కాల్వలో డెక్కనిర్మూలనకు రూ.30లక్షల అంచనాతో డ్రోన్ ద్వారా మందు పిచికారీ చేస్తున్నామని ఏఈ నాగబాబు తెలిపారు. ఖరీఫ్‌సాగుకు నీరు విడుదల చేయాల్సిన పరిస్థితుల్లో కాల్వలో పేరుకు పోయిన డెక్క, తూడు నిర్మూలనకు చర్యలు చేపట్టామని తెలిపారు.

ఉపాధి హామీ కార్మికుల వేతనాలు విడుదల చేయాలి

గన్నవరం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ కార్మికుల వేతనాలను వెంటనే విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కళ్లం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మాదలవారిగూడెం పంచాయితీ కార్యాలయం వద్ద ఉపాధి హామీ కార్మికులతో కలసి సీపీఎం నాయకులు గురువారం నిరసన తెలిపారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మూడు నెలల నుంచి కార్మికులకు వేతనాలు సక్రమంగా చెల్లించటం లేదన్నారు. వేతనాలు చెల్లించటంతో పాటు 200 రోజుల పని దినాలు కల్పించాలన్నారు. సూరంపల్లి పంచాయితీ కార్యాలయం వద్ద కూడా నిరసన తెలిపారు. నాయకులు బెజవాడ తాతబ్బాయి, కైలే ఏసుదాసు, లంక మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

హనుమాన్‌జంక్షన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : మోటారు వాహన చట్టం ప్రకారం వాహన చోదకులు విధిగా నిబంధనలు పాటించాలని ఎస్సై వి.సురేశ్ అన్నారు. జంక్షన్ సెంటర్‌లో బుధవారం రాత్రి ఆయన వాహన తనిఖీలు నిర్వహించారు. ఆటోలు, మోటారు సైకిళ్లపై ప్రయాణించే వారి ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణించిన పలువురికి జరిమానా విధించారు. జంక్షన్ నాలుగు రోడ్లలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

కూటమి ప్రభుత్వంలో సుపరిపాలన



సుపరిపాలనలో తొలిఅడుగు సందర్భంగా ఉయ్యూరులో కేక్‌కట్‌చేస్తున్న రాజేంద్రప్రసాద్

ఉయ్యూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : సుపరిపాలనతో కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తిచేసుకుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యలమంచిలి వెంకట బాబూ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ప్రజాపాలనలో ఏడాదిపూర్తయిన సందర్భంగా గురువారం ఉయ్యూరులో విజయోత్సవం నిర్వహించారు. పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి రాజేంద్రప్రసాద్ కేక్ కట్ చేసి అభినందనలు తెలిపారు. పార్టీ నా యకులు అజ్మతుల్లా, కుటుంబరావు, అప్పల నాయుడు, నరేశ్, కౌన్సిలర్లు పద్మావతి, పరిమి సలోమి పాల్గొన్నారు. **గన్నవరం :** కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఏఎంసీ మాజీ ఛైర్మన్ పొట్లూరి బసవరావు అన్నారు. అప్సర థియేటర్ సమీపంలో టీడీపీ సీనియర్ నాయకులు జాస్తి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కూటమి ఏడాది పాలన సంబరాలను గురువారం రాత్రి జరిపారు. కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. టీడీపీ నాయకులు జూపల్లి సురేష్, మండవ లక్ష్మీ, ఆరుమళ్ల కృష్ణారెడ్డి, న్యాయవాదులు సోమేశ్వరరావు, రమేష్, కేసరపల్లి



వీరవల్లి టీడీపీ కార్యాలయం వద్ద కేక్‌కట్ చేస్తున్న తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి గుండపనేని ఉమావరప్రసాద్

ఉపసర్పంచ్ జాస్తి శ్రీధర్ బాబు, శొంఠి కిషోర్, అన్వేష్, కెహెచ్ కోటేశ్వరరావు, అబుల్యాజ్, శాంతమ్మ పాల్గొన్నారు. **హనుమాన్‌జంక్షన్ :** ప్రజారంజక పాలన అందిస్తూ కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం జంక్షన్ సెంటర్‌లో సంబరాలు నిర్వహించారు. ఈఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చిత్రపటాలకు పాలాభిషేకం జరిపారు. కూటమి నేతలు ఆళ్ల గోపాలకృష్ణారావు, కొమ్మారెడ్డి రాజేశ్, మూల్పూరి సాయి కల్యాణి, ఉమా వరప్రసాద్, చలమలశెట్టి రమేశ్‌బాబు, వేగిరెడ్డి పాపారావు, దన్నే దుర్గారావు, అట్లూరి శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, రాజేశ్వరరావు, మొవ్వా వేణుగోపాల్, మండాది రవీంద్ర పాల్గొన్నారు. **హనుమాన్‌జంక్షన్‌రూరల్ :** కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా గ్రామాల్లో గురువారం కూటమి శ్రేణులు సంబరాలు నిర్వహించారు. మల్లవల్లి, రేమల్లె, వీరవల్లి, తిప్పనగుంట, కొత్తపల్లి, మడిచర్ల తదితర గ్రామాల్లో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మాదాల శ్రీనివాసరావు, సిరివాడ టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎర్రిబోయిన కుమారస్వామి కేక్ కట్ చేశారు. తుమ్మల బాబ్జి, సింగవరపు వెంకటేశ్వరరావు, నల్లమోతు జీవ, పాల్గొన్నారు. వీరవల్లిలో తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి గుండపనేని ఉమావరప్రసాద్, ఉపసర్పంచ్ లంక అజయ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు అమృతపల్లి సూర్యనారాయణ కేక్‌కట్ చేశారు. మాజీ సర్పంచ్ పిల్లా రామారావు, తెలుగుయువత జిల్లా కార్యదర్శి మండాది రవీంద్ర, కలపాల నాని, మల్లిఖార్జునరావు, కగ్గా రామకృష్ణ పాల్గొన్నారు. మల్లవల్లిలో కమిటీ అధ్యక్షుడు అక్కినేని ధర్మరాజు, నాగరాజు, కృష్ణాజీ కేక్ కట్ చేశారు. బాణసంచా కాలుస్తూ సంబరాలు నిర్వహించారు. **విజయవాడ రూరల్ :** కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలో టీడీపీ నేతలు గురువారం సంబరాలు జరుపుకున్నారు. చెరువు సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసిన గ్రామ



జంక్షన్‌సెంటర్‌లో కూటమి అధినేతలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

టీడీపీ నేతలు కేక్ కట్ చేసి స్థానికులకు పంచారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు కలకోటి శ్రీనివాసరెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షుడు గంపా శ్రీనివాసయాదవ్, నేతలు పోలారెడ్డి సాంబిరెడ్డి, పామర్తి శ్రీను, యార్కారెడ్డి కోటిరెడ్డి, బేతపూడి మురళి, భుక్యా శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు. **పెనమలూరు :** ఏపీలో మున్ముందు ఎప్పటికీ టీడీపీ కూటమి ప్రభుత్వ పాలనే కొనసాగుతుందని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. అశోక్‌నగర్‌లోని వెలగపూడి కార్యాలయంలో ఆయన కూటమి ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా టీడీపీ కూటమి అభిమానుల సమక్షంలో కేకును కోసి వేడుకలు నిర్వహించారు. టీడీపీ కూటమి పార్టీలు ఎప్పటికీ కలిసి మెలిసి ప్రయాణిస్తూ రాష్ట్రాభివృద్ధికి పాటుపడతాయని పేర్కొన్నారు. కూటమి నాయకులు మొక్కపాటి శ్రీనివాస్, దోనేపూడి రవికిరణ్, అన్నపూర్ణ, రియాజ్, రఫీ, రమేష్, కొండ, సుబ్బారావు, శరత్, ఇక్బాల్, శ్రీహరి, వేములపల్లి, పులి రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



గన్నవరంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

అన్యాక్రాంతమైన స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

ఉయ్యూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : గండిగుంటలో శ్రీకోందడరామస్వామి ఆలయం సమీపాన అన్యాక్రాంతమైన గ్రామపంచాయతీ స్థలంలో పంచాయతీ కార్యదర్శి ఎట్టకేలకు హెచ్చరిక బోర్డు గురువారం ఏర్పాటు చేశారు. గ్రామం నడిబొడ్డున ఎన్టీఆర్ సర్కిల్, కోదండరామాలయం సమీపాన సుమారు 10 సెంట్ల గ్రామకంఠం భూమిని ముక్కామల నిర్మలాకుమారి తన పూర్వార్జిత ఆస్థిగా నమోదు చేసి వీలునామా రాసి 1072/1 సర్వే నెంబరుతో ఆగస్టు 28, 2024న ఉయ్యూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో 163/ బికే3/2024 నంబరుతో తన కుమారుడు శాయోజీరావుకు వీలునామా రిజిస్టర్ చేశారు. ఈస్థలంపై గతం లో పలుమార్లు వివాదాల జరిగినప్పటికీ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. రూ.50లక్షల విలువచేసే ప్రభుత్వ స్థలాన్ని అన్యాక్రాంతం చే సిన విషయం గ్రామంలో చర్చనీయాంశమైంది. సుమారు 10 సెంట్ల గ్రామ కంఠం భూమి పంచాయతీకి చెందినది. ఇందులో ఏవిధమైన నిర్మాణాలు చేయరాదు. అతిక్రమించిన వారు శిక్షార్హులు. ఉల్లంఘించిన వారిపై సివిల్ అండ్ క్రిమినల్ చర్యలు తీసుకుంటామని అని తెలియజేస్తూ గ్రామపంచాయతీ కార్యదర్శి



అన్యాక్రాంతమైన పంచాయతీ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేసిన పంచాయతీ కార్యదర్శి

పేరుతో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

వీలునామా రద్దు చేసుకుంటా : శాయోజీరావు

సుమారు10 సెంట్ల గ్రామకంఠం పంచాయతీ భూమిని తన తల్లి నుంచి వీలునామ ద్వారా చేయించుకున్న రిజిస్ట్రేషన్‌ను రద్దుపరుచుకుంటున్నట్టు ముక్కామల శాయోజీరావు గ్రామపంచాయతీ కార్యదర్శికి లిఖిత పూర్వకంగా తెలియజేశారు. పంచాయతీ ఆస్తిని ఆక్రమించుకుని రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్టు శాయోజీరావు, ఆయన తల్లి ముక్కమల నిర్మలకుమారికి గ్రామ పంచాయతీ కార్యదర్శి ఈనెల 9న నోటీసు ఇ చ్చారు. దాంతో శాయోజీరావు లిఖిత పూర్వకంగా రిజిస్ట్రేషన్ రద్దు చేసుకుంటున్నట్లు కార్యదర్శికి తెలియజేశారు.

ప్రభుత్వ సహకారంతో ఉత్తమ ఫలితాలు సాధించాలి

హనుమాన్‌జంక్షన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా విద్యార్థులు కృషి చేయాలని బాపులపాడు జడ్పీ హైస్కూల్ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ సుంకర సుభాష్‌చంద్రబోస్ అన్నారు. గురువారం పాఠశాలలు పునఃప్రారంభం సందర్భంగా బాపులపాడు జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ప్రభుత్వం అందించిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ చేశారు. మండలంలో 3838 కిట్లు పంపిణీ చేసినట్లు ఎంఈవో రాంబాల సింగ్ తెలిపారు. అభివృద్ధి కమిటీ కార్యదర్శి వీరమాచనేని సత్యప్రసాద్, ఎంపీపీ వై.నగేశ్, పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. **హనుమాన్‌జంక్షన్‌రూరల్ :** ప్రభుత్వ సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ అనిత సూచించారు. వీరవల్లి హైస్కూల్ హెచ్ఎం నిర్మల ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లను గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గుండపనేని ఉమావరప్రసాద్‌తో కలిసి పంపిణీ చేశారు. ఎంపీ



విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

టీసీ సభ్యుడు అమృతపల్లి సూర్యనారాయణ, ఉపసర్పంచ్ లంక అజయ్‌కుమార్, రమణగోపాల్, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **గన్నవరం :** ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు నోట్ బుక్స్ ఇతర సామాగ్రిని ప్రభుత్వం తొలిరోజే అందించిందని గుడివాడ డీవైఈవో కొండా రవికుమార్ అన్నారు. కేసరపల్లిలో విద్యార్థులకు కిట్‌ను గురువారం అందజేశారు. రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విలువలతో కూడిన విద్య అందుతుందని తెలిపారు. స్థానిక సిల్వర్ జూబ్లీ పాఠశాలలో కూడా అందజేశారు. ఎంఈవో-2 కమల, హెచ్ఎం సవార్త రాణి పాల్గొన్నారు.

గండిగుంటలో చెత్తకుప్పల తొలగింపు

ఉయ్యూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : గండిగుంటలో పేరుకుపోయిన చెత్త కుప్పల తొలగింపునకు గ్రామ పంచాయతీ అధికారులు గురువారం చర్యలు చేపటారు. గ్రామ పరిధిలో సర్వీసురోడ్ల వెంబడి, అంతర్గత రోడ్లపక్కన చెత్తపేరుకుపోయి దుర్గంధం వ్యాపిస్తూ ప్రజలకు అసౌక ర్యం కలుగుతున్న వైనాన్ని చెత్త శుద్ధి ఏదీ శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన గ్రామ కార్యదర్శి శ్రీకుమార్ సిబ్బందితో ట్రాక్టర్ల ద్వారా చెత్తకుప్పల తొలగింపునకు చర్యలు చేపట్టారు. సిబ్బంది ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ చేస్తున్నారని తెలిపారు.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]



చెత్తకుప్పలు తొలగిస్తున్న పంచాయితీ సిబ్బంది

సమష్టి కృషితోనే మండలాభివృద్ధి

● వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్

గన్నవరం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితోనే మండలాన్ని అభివృద్ధి పథం నడిపిద్దామని వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సర్వసభ్య సమావేశం జరిగింది. సుధీర్ మాట్లాడుతూ మండల పరిషత్ నుంచి సుమారు రూ.4 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సహకారంతో ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధిని మరింత వేగవంతం చేస్తామని తెలిపారు. రహదారులు, డ్రైనేజీ నిర్మాణాలకు ప్రాధాన్యతనిస్తున్నట్లు చెప్పారు. అధికారులు తమ నివేదికలను సమర్పించారు. గాంధీ బొమ్మ సెంటర్‌లో పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీటీసీ సభ్యులు పడమట రంగారావు అన్నారు.



మండల పరిషత్ సమావేశంలో నివేదిక సమర్పిస్తున్న ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈఈ సుజాత

ఎంపీపీ అనగాని రవి నాలుగు సమావేశాలకు గైర్హాజరు అయినందున పంచాయతీ రాజ్ యాక్ట్ ప్రకారం తొలగించేందుకు అవకాశం ఉందని దానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే ఉన్నతాధికారులకు రిపోర్టు చేసినట్లు ఎంపీడీవో టి.స్వర్ణలత వివరణ ఇచ్చారు. జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని, సీడీపీవో మంగమ్మ, పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి

ఉంగుటూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ పథకం కింద లబ్ధిపొందేందుకు అర్హులైన రైతులు సంబంధిత రైతుసేవాకేంద్రాల్లో వీఏఏల ద్వారా బయోమెట్రిక్ ఈకేవైసీ (వేలిముద్ర)చేయించే ప్రక్రియ ఈనెల 20వతేదీ లోపుగా పూర్తి చేయించుకోవాలని ఏవో వీవీఎస్ఆర్ఎస్ హరీష్‌కుమార్ తెలిపారు. రైతుసేవాకేంద్రంలో రైతుల బయోమెట్రిక్‌ను ఏఈవో బి.దుర్గానాగేశ్వరరావుతో కలిసి పరిశీలించారు. వీఏఏ రసూల్, రైతులు పాల్గొన్నారు. **ఉయ్యూరు :** అన్నదాత సుఖీభవ పథకం పొందేందుకు రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి. నిస్సీగ్రేస్ తెలిపారు. రైతులు ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకుని సమీపంలో ఉన్న రైతుసహాయ కేంద్రంలో సంప్రదించాలన్నారు. ఎ రైతులు జాబితాలో పేరు చూసుకుని రైతు సేవాకేంద్రంలో వేలిముద్ర వేయాలన్నారు. ఈకేవైసీ పూర్తిచేయించుకున్న వారికే అన్నదాత సుఖీభవ పథకం వస్తుందని తెలిపారు.

విమాన ప్రమాదం బాధాకరం : తుమ్మలపల్లి

కంకిపాడు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : అహ్మదాబాద్‌లో జరిగిన విమాన దుర్ఘటన దురదృష్టకరమని టీడీపీ సీనియర్ నాయకులు, దస్తావేజు లేఖర్ల వృత్తి పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మలపల్లి హరికృష్ణ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఏయిర్ ఇండియా విమానం టేకాఫ్ అయిన కొద్ది సేపటికే కుప్పకూలడం దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు. సుమారు 240 మంది మృతి చెందినట్లు కథనాలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విమాన ప్రయాణికులతో పాటు ఎన్నో ఆశలతో వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు మృత్యువాత పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇటువంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని కోరారు. టీడీపీ నాయకులు పులి శ్రీనివాసరావు, కొండా నాగేశ్వరరావు, ఏనుగ జయప్రకాష్, చిట్టూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జంక్షన్ అగ్నిమాపకాధికారిగా అమలేశ్వరరావు

హనుమాన్‌జంక్షన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి) : జంక్షన్ అగ్నిమాపక అధికారిగా వి.అమలేశ్వరరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. కుంచనపల్లి ఎస్‌డీఎంఏ విభాగం నుంచి ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన ఫైర్ ఆఫీసర్ రామ్మోహన్‌రావు బంటుమిల్లి బదిలీపై వెళ్లారు.

మలేరియా వ్యతిరేక పోరాటంలో భాగస్వాములు కావాలి

గన్నవరం : మలేరియా వ్యతిరేక పోరాటంలో అందరు భాగస్వాములు కావాలని డాక్టర్ కరీముల్లా అన్నారు. ఆత్కూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో తెంపల్లిలో మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీని గురువారం నిర్వహించారు. డాక్టర్ కరీముల్లా మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందకుండా తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటరాజు రాయుడు, హెల్త్ సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ వి.సాంబశివరావు, అంకమ్మ, మంజుల, విమల, దుర్గా, మేరీ, శకుంతల పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసాలు




పెదఅవుటపల్లిలో ..

ఉయ్యూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు పట్టణం, మండల పరిధి గ్రామాల అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు గురువారం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఉయ్యూరు నగరపంచాయతీ కార్యాలయంలో ఛైర్మన్ వి.సత్యనారాయణ, గండిగుంటలో ఎంపీడీవో శేషగిరిరావు, కలవపాములలో మహిళా సంరక్షణ కార్యదర్శి ఆదిరాజు లక్ష్మీ మధుశాలిని చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి అక్షరాలు దిద్దించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బేబీ సరోజిని, సులోచనారాణి పాల్గొన్నారు. **హనుమాన్‌జంక్షన్ రూరల్ :** ఆరోగ్యంతో పాటు చదువు అంగన్వాడీ చిన్నారులకు మాత్రమే లభిస్తుందని ఎంపీపీ స్కూల్‌హెచ్ఎం మోహనకృష్ణ, సర్పంచ్ పిల్లా అనిత అన్నారు. వీరవల్లి ఆర్‌పీహెచ్ కాలనీలో హేమలత ఆధ్వర్యంలో, సచివాలయంలో సుంకర రమాదేవి ఆధ్వర్యంలో గురువారం చిన్నారులకు



హనుమాన్‌జంక్షన్ రూరల్‌లో..

అక్షరాభ్యాసం చేయించారు. ఆర్‌పీహెచ్ కాలనీలో ఎంపీపీ స్కూల్ హెచ్ఎం మోహనకృష్ణ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించగా, సచివాలయంలో సర్పంచ్ పిల్లా అనిత అక్షరాభ్యాసం చేయించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న ఆయాలు, వర్కర్లు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివన్నారు. **ఉంగుటూరు :** అంగన్వాడీకేంద్రాల్లో మూడు నుంచి ఐదేళ్లలోపు పిల్లలందరినీ చేర్పించాలని ఎంపీపీ వడ్లమూడి సరోజిని తల్లిదండ్రులకు సూచించారు. ఉంగుటూరు, పెదఅవుటపల్లి, తేలప్రోలు గ్రామాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మన అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఉంగుటూరు మండలపరిషత్ ఆవరణలోని స్త్రీశక్తిభవనం మీటింగ్ హాలులో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ ఆటపాటలతో కూడిన అంగన్వాడీ విద్య చిన్నారుల బంగారు భవిష్యత్తుకు బాట వేస్తుందన్నారు. సామూహిక అక్షరాభ్యాసం చేయించి, పలకలు, బలపాలు పంపిణీ చేశారు. ఎంపీడీవో సత్యకుమార్, ఈవోపీఆర్డీ వి.దిలీప్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎల్.దుర్గాదేవి, సర్పంచ్ ప్రసాద్, అంగన్వాడీ కార్యకర్తలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు. పెదఅవుటపల్లి, తేలప్రోలు అంగన్వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.పద్మాదేవి ఆధ్వర్యంలో అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పెదఅవుటపల్లిలో అంగన్వాడీ బడి అమ్మ ఒడి అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఆయాగ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులచే సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. పెదఅవుటపల్లి పంచాయతీ సెక్రటరీ యోహాన్, తేలప్రోలు సర్పంచ్ లాం



తేలప్రోలులో..

దిబోర, కార్యకర్తలు పాల్గొన్నారు. **కంకిపాడు :** చిన్నారులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో నాణ్యమైన విద్య, పౌష్టికాహారాన్ని అందించాలని ఎంపీడీవో అనూష్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఏవో బసవయ్య, జిల్లా అంగన్ వాడీ డ్వాక్రా సంఘాల ప్రధాన కార్యదర్శి అన్నవరపు శివపార్వతి, నీరజ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎస్. అన్నామణి, ఎస్‌కె రెహానా బేగం, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **పెనమలూరు :** తాడిగడపలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. సెక్టారు సూపర్‌వైజర్ శ్రీలత సమక్షంలో స్థానిక టీడీపీ నాయకులు నర్రా చంటి అధ్యక్షతన కార్యక్రమాలు వేడుకగా జరిగాయి. మహిళా పోలీస్ సుమతి, శృతి, ఇంతియాజ్, రత్నకుమారి,పాల్గొన్నారు.



కలువపాములలో..



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	116, 125, 136
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 535

జాబ్ మేళా ఈ నెల18న

పామర్రు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతి, యువకులకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతో ఏపీ స్కిల్ డవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఈనెల 18న పామర్రులోని ఆరేపల్లి కల్యాణ మండిరంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ఆసంస్థ జిల్లా మేనేజర్ పి.నరేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా చేతుల మీదగా గురువారం ప్రచార గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి నుంచి డిగ్రీ చదివిన నిరుద్యోగ యువతి, యువకులకు వివిధ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నామన్నారు. ఎంపికైన వారికి రూ. 8000 నుంచి రూ.20,000 వరకు జీతాలు ఉంటాయన్నారు. ఆసక్తి గల నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కూటమి నేతలు పాల్గొన్నారు.

శివారు ప్రాంతాలను అభివృద్ధి చేస్తా

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన శివారు ప్రాంత కాలనీలను అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గురువారం స్థానిక 30వవార్డు ధనియాలపేటలో రూ.3కోట్లవ్యయంతో, 28వ వార్డు వాంబేకాలనీలో రూ.1.50కోట్ల వ్యయంతో, న్యూ ఇందిరానగర్ కాలనీలో రూ.1.50కోట్ల వ్యయంతో నిర్మించనున్న సీసీ రహదారులు, డ్రెయిన్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తైన సందర్భంగా విజయోత్సవ కేక్‌ను కట్‌చేశారు. ధనియాలపేటలో విజయోత్సవ జెండా దిమ్మను ఆవిష్కరించారు. ముడా చైర్మన్ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, మున్సిపల్ ఇంజినీర్ ప్రసాద్ పాల్గొన్నారు.



రోడ్డు శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే వెనిగండ్ల

గుడివాడ : గురువారం స్థానిక నాగవరప్పాడు సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద నుంచి పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా స్టేడియం వద్ద గల ఎన్టీఆర్ విగ్రహం వరకు ఎమ్మెల్యే వెనిగండ్ల ఆధ్వర్యంలో కూటమి శ్రేణులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళలర్పించి భారీ కేక్‌ను కట్ చేశారు. మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ పిన్నమనేని బాబ్జీ, గుడివాడ, గుడ్లవల్లేరు మార్కెట్ యార్డు చైర్మన్లు రవి, పొట్లూరి రవి, వైస్ చైర్మన్ సుబ్బారావు, తెలుగు యువత జిల్లాఅధ్యక్షుడు దండమూడి చౌదరి పాల్గొన్నారు.

గుడివాడ : గుడివాడ నియోజకవర్గ అభివృద్ధికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రూ.608కోట్లు నిధులు మంజూరైనట్టు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. గురువారం స్థానిక రాజేంద్రనగర్‌లోని ఆయన స్వగృహంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైల్వే గేట్ల వద్ద సమస్యల పరిష్కారానికి ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌ల నిర్మాణానికి రూ.400కోట్లు నిధు లు మంజూరయ్యాయన్నారు. అమృత్ 2.0 భా గంగా గుడివాడ మున్సిపాల్టీ అభివృద్ధికి రూ.136 కోట్లు మంజూరయ్యాయని, ప్రధాన రహదారుల అభివృద్ధికి నేషనల్ హైవేశాఖ నుండి రూ.35.23 కోట్లు మంజూరయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వంలోనే బస్టాండును నిర్మిస్తామన్నారు.

రైతు సంక్షేమమే కూటమి ధ్యేయం

● ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమం కోసం నిరంతరం కూటమి ప్రభుత్వం కట్టుబడి ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. స్థానిక బల్లిపర్రులాకుల వద్ద ఇరిగేషన్‌శాఖ ఆధ్వర్యంలో రూ.8.93 కోట్లతో జరగబోయే అభివృద్ధి పనులను గురువారం కూటమి శ్రేణులతో కలసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సాగుకు అవసరమైన సాగునీటి సరఫరాలో ఇబ్బందులను అధిగమించడంకోసం నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. పామర్రులోని కాల్వల మరమ్మతులతోపాటు, దెబ్బతిన్న లాకుల గేట్ల స్థానంలో కొత్త గేట్లు ఏర్పాటుకు ప్రభుత్వం విపత్తుల నిర్వహణ నిధులతోపాటుగా ఆపరేషన్ నిర్వహణ నిధులు రూ.8.93 కోట్ల నిధులను విడుదలచేసిందన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పు కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్‌చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, కురుమద్దాలి పామర్రు డీసీ కొసరాజు వేంకటేశ్వరరావు, గొట్టిపాటి లక్ష్మీదాసు, జక్కా శ్రీనివాసరావు, బల్లిపర్రు సర్పంచ్ నిమ్మగడ్డ సుధాకర్, జన్ను శోభన్ బాబు, లాజరస్, పాల్గొన్నారు.

పామర్రు : అన్ని వర్గాల ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటూ ప్రజారంజక పాలన అందిస్తూ ఏడాది పూర్తిచేసుకున్న కూటమి ప్రభుత్వం పట్ల ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. రాష్ట్రంలో కూటమి సర్కార్ ఏర్పడి ఏడాదికాలం పూర్తిచేసుకున్న సందర్భంగా స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం కూటమిశ్రేణుల నేతృత్వంలో ఏడాది విజయోత్సవ కేక్ కట్‌చేసి నేతలకు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. అనంతరం కూమార్‌రాజా మాట్లాడుతూ, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి రూ.166.54 కోట్లతో పామర్రు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాలు సమకూర్చడంతోపాటు రహదారుల నిర్మాణాలు ఇతర అభివృద్ధి పనులు చేశామన్నారు. ఈకార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, గొట్టిపాటి లక్ష్మీదాసు, ఐదుమండలాలకు చెందిన కూటమిశ్రేణులు పాల్గొన్నారు.



బల్లిపర్రులాకుల వద్ద ఇరిగేషన్ అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా

ట్రాలి ఢీకొని వృద్ధుడి మృతి

నందివాడ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అరిపిరాల నుంచి గుడివాడకు టీవీఎస్‌పై వెళ్తున్న రామపూరి భిక్షాలు (69) అనే వ్యక్తి జనార్థనపురం శివారు ఆర్టీవో ట్రైనింగ్ ఆఫీస్ వద్ద ట్రాలి వెనుకకు తీస్తుండగా, ఢీకొట్టాడు. దీంతో అతడి తలకు బలమైన గాయం తగిలింది. గుడివాడలోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యం చేస్తుండగా మృతి చెందినట్టు నందివాడ పోలీస్ స్టేషన్ రైటర్ జగన్ తెలిపారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



బొమ్ములూరులో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీపీ శివరామకృష్ణ

గుడివాడకు తరలిన టీడీపీ శ్రేణులు

గుడివాడ రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలమైనందున బొమ్ములూరులో మాజీ ఎంపీపీ గుత్తా శివరామకృష్ణ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో వివిధ రకాల సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు కావటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం గుడ్లవల్లేరు, బొమ్ములూరుకు చెందిన టీడీపీ శ్రేణులు సంయుక్తంగా గుడివాడ ర్యాలీకి బైక్‌లపై తరలివచ్చారు.

గుడ్లవల్లేరు : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అయిన సందర్భంగా గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము బైక్‌ర్యాలీకి పిలుపునివ్వగా వడ్లమన్నాడు, కౌతవరం, డోకిపర్రు, గుడ్లవల్లేరు, అంగలూరు, చింతలగుంట ఇలా ఆయా గ్రామాల నుంచి కార్యకర్తలు, నాయకులు ఎవరికివారు బైక్‌లపై గుడివాడకు చేరుకొని ఎమ్మెల్యే నిర్వహించిన బైక్‌ర్యాలీలో పాల్గొన్నారు.

సాంకేతిక విధానంతో అధిక దిగుబడులు సాధ్యం

● కేవీకే ఉద్యాన వన శాస్త్రవేత్త డాక్టర్ వి.మంజువాణి

గుడివాడ రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆధునిక, శాస్త్రసాంకేతిక విధానం అవలంబించి కూరగాయలు సాగిచేస్తే లాభాలతోపాటు ప్రజలకు చక్కటి ఆరోగ్యం అందించిన వారవుతారని కేవీకే ఉద్యాన వన శాస్త్రవేత్త డాక్టర్ వి.మంజువాణి అన్నారు. చౌటపల్లిలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు మేలు రకమైన కూరగాయల మొక్కలు పెంచుకుని వాటిని ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తే లాభాలు పెరుగుతాయని తెలిపారు. ప్రతి రైతూ వాతావరణ అనుకూల మార్పులను గమనించి ఉద్యాన వన పంటలను సాగు చేయాలని కోరారు. ఆయిల్ పామ్ పరిశోధనా సంస్థ డాక్టర్ కల్యాణ్ బాబు మాట్లాడుతూ గుడివాడ డివిజన్‌లో ఆయిల్ పామ్ సాగుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా వనరుల కేంద్రం అధికారిణి జ్యోతి రమణి మాట్లాడుతూ ముందుగా రైతులు విత్తనశుద్ధి చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, లహరి, మండల వ్యవసాయాధికారి బోలెం అనంత లక్ష్మీ, సర్పంచ్ వెలగలేటి రమ్య, చౌటపల్లి గ్రామ టీడీపీ నాయకులు అట్లూరి రమణ ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వి.మంజువాణి

విద్యార్థులకు యూనిఫామ్, పుస్తకాల పంపిణీ

కూచిపూడి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు ప్రారంభించిన తొలి రోజే 1 నుంచి 10వ తరగతి చదివే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందించిన నోటుపుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ దుస్తులను ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధులు గురువారం అందజేశారు. కూచిపూడి జడ్పీ పాఠశాలలో జరిగిన పంపిణీ కార్యక్రమంలో సర్పంచ్ కొండవీటి విజయలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ దోనేపూడి శివరామయ్య, టీడీపీ మండల పార్టీ కార్యదర్శి వీరంకి తులసీదాస్, గ్రామ పార్టీ అధ్యక్షుడు వెంపటి గోపాలకృష్ణ, హెచ్‌ఎం భువనేశ్వరి పాల్గొన్నారు. బ్యాగులు, బూట్లు పంపిణీ చేయాల్సి ఉంది.

గుడివాడ రూరల్ : పాఠశాలలు పునః ప్రారంభం కావటంతో వివిధ పాఠశాలల్లో విద్యా కిట్లనుపంపిణీ చేశారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించారు. మొదటి రోజే 70 శాతం మంది విద్యార్థులు పాఠశాలకు హాజరు కావటం మంచి శుభపరిణామమని ఎంఈవో-1 జగన్మోహనరావు తెలిపారు. ఎంఈవో-2 బాలాజీ ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యా కిట్లు డ్రస్‌లను ఖచ్చితంగా విద్యార్థులకు అందించాలని ఆదేశించారు.



యూనిఫామ్, పుస్తకాలు అందజేస్తున్న భువనేశ్వరి

రేషన్‌షాపు ఏర్పాటుచేయడం అభినందనీయం



తహసీల్దార్‌కు ధన్యవాదాలు తెలుపుతున్న రామకృష్ణ

గుడివాడ రూరల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి) : టిడ్కో కాలనీలో కోరిన వెంటనే స్పందించి తహసీల్దార్ వి.రామకోటేశ్వరరావు రేషన్‌షాపును ఏర్పాటు చేయడం అభినందనీయమని బీజేపీ టూటౌన్ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ(ఆర్.కె)పేర్కొన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడ్కోకాలనీలో పేదలు, వితంతువులు, ఒంటరి మహిళలు రేషన్ తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. టిడ్కో కాలనీ వాసుల సమస్యను స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, తహసీల్దార్ రామకోటేశ్వరరావుల దృష్టికి తీసుకువచ్చిన 24గంటల వ్యవధిలోనే రేషన్ షాపును ఏర్పాటు చేశారన్నారు. పీడీఎస్ డీటీ కిరణ్, ఆర్‌ఐ నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలను విక్రయించడం దారుణం

● ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎస్.సమరం

గుడివాడ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : పేద, మధ్య తరగతివారికి ఉచిత విద్యను అందిస్తున్నట్టు చెప్పుకునే ఫాదర్ బియాంకి పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా పాఠ్య పుస్తకాల అమ్మకాలు చేపట్టడం దారుణమని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎస్.సమరం ఆరోపించారు. గురువారం స్థానిక ఏలూరురోడ్డులోని ఫాదర్ బియాంకి పాఠశాలలో పాఠ్యపుస్తకాల అమ్మకాలను ఆయన అడ్డుకున్నారు. మండల విద్యాశాఖాధికారి బాలాజీకి సమాచారం అందించిన ఎలాంటి చర్యలు తీసుకోకుండా పాఠశాల యాజమానానికి అనుకూలంగా మాట్లాడారని ఆయన ఆగ్రహంవ్యక్తం చేశారు. యాజమాన్యానికి అనుకూలంగా పోలీస్ వ్యవస్థ సైతం ఎస్‌ఎఫ్‌ఐ నాయకులపై దౌర్జన్యంగా ఎఫ్‌ఐఆర్‌ను నమోదు చేశారన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠ్యపుస్తకావిక్రయిస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ కార్యదర్శి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఫాదర్ బియాంకి పాఠశాలలో ఎస్‌ఎఫ్‌ఐ నేత సమరం

లక్ష్మీగణపతి హోమం రేపు

గుడివాడ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మెయిన్‌రోడ్డులో వేంచేసియున్న విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 14వ తేదీ సంకటహర చతుర్థి సందర్భంగా ఆలయ ఆవరణలో వేదపండితులచే లక్ష్మీగణపతి హోమం నిర్వహిస్తున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు(వాసు) గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హోమం పూజ కార్యక్రమంలో పాల్గొనే దంపతులు రూ.516లు చెల్లించి తమ గోత్ర నామాలను నమోదు చేసుకోవాలని కోరారు. పూజా సామగ్రిని దేవస్థానం సమకూరుస్తుందని ఈవో తెలిపారు.

రక్తదానం

గుడివాడ : కానుమోలుకు చెందిన సాగల బత్తిన నాంచారయ్యకు స్థానిక ఆర్‌కే ఆస్పత్రిలో శస్త్రచికిత్స నిమిత్తం రక్తం అవసరమవగా గురువారం కొనకళ్ల సీతయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో కుంద కిరణ్ రక్తదానం చేశారు. ట్రస్ట్ చైర్మన్ కొనకళ్ల సీతయ్య, రక్తదాత కిరణ్‌ను అభినందించారు.

పాఠశాలలు పునఃప్రారంభం

గుడ్లవల్లేరు: కొత్త విద్యాసంవత్సం 2025-26 గురువారం ప్రారంభమైనది. కాగా ఈ నూతన విద్యాసంవత్సరం ప్రారంభం రోజున గుడ్లవల్లేరు మండలంలోని 68 పాఠశాలల్లో 2656 మంది విద్యార్థులు హాజరు కావల్సి ఉండగా 1112 మంది విద్యార్థులు బడులకు వచ్చారని ఎంఈవో జగన్మోహనరావు తెలిపారు. తొలిరోజునే పుస్తకాల పంపిణీ చేశామనీ ఆయన తెలిపారు.

టిడ్కో గృహాల రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోండి : కమిషనర్

గుడివాడ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : మల్లాయిపాలెం గ్రామశివారులో టిడ్కో గృహాలు పొంది, బ్యాంకు రుణాలు మంజూరైన లబ్ధిదారులందరూ మార్టగేజ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని మున్సిపల్ కమీషనర్ సింహాద్రి మనోహర్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. స్థానిక కైకాల కళామందిరంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో మార్టగేజ్ రిజిస్ట్రేషన్ కోసం ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెలాఖరు లోపు పెండింగ్‌లో ఉన్న మార్టగేజ్ రిజిస్ట్రేషన్‌లను పూర్తి చేసుకోవాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. రిజిస్ట్రేషన్ కానీ వారు కట్టవలసిన నగదును చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. ఎటువంటి సందేహాలున్న టౌన్ ప్లానింగ్ సెక్షన్ నందు జి-2 క్లర్క్ శ్రీనివాస్ సెల్: 77021 54111, మెప్మా సి.ఎం.ఎం బసవేశ్వరరావు సెల్ : 79016 101855కు సంప్రదించాలని కమిషనర్ మనోహర్ కోరారు.

ఘనంగా అంగన్వాడీల్లో సామూహిక అక్షరాభ్యాసాలు



గుడివాడ రూరల్‌లో..

గుడివాడ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ఐసీడీఎస్ గుడివాడ -1 సెక్టారు పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో గురువారం సామూహిక అక్షరాభ్యాసాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా సీడీపీవో విజయఫ్లొరెన్స్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భవాని, నాగజ్యోతి, నజీరున్నీసా, ఏసీడీపీవో పద్మావతి, జయంతి, తెలుగు మహిళ పట్టణ అధ్యక్షురాలు యార్లగడ్డ సుధారాణి, 15వవార్డు ఇన్‌చార్జ్ వేశపోగు ఇమ్మానియేలు, ఎంఎస్‌కేలు షేక్ షకీనా బేగం, హైమావతి పాల్గొన్నారు.

గుడివాడ రూరల్ : బిళ్లపాడు -2 కేంద్రంలో మూడేళ్లు నిండిన పిల్లలకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో విజయఫ్లొరెన్స్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను మూడు సంవత్సరాలు నిండగానే అంగన్వాడీలో చేర్పించాలన్నారు. ప్రతి విద్యార్థి అంగన్వాడీలో చేర్పటం ద్వారా చాలా ఉపయోగం ఉందని, పిల్లలకు పౌష్ఠికాహారం, పిల్లలతో ఏలా మెలగాలో తెలుస్తుందన్నారు. అంగన్వాడీ సూపర్‌వైజర్లు నసీరున్నీసా, జయంతి, నాగజ్యోతి, భవాని, అంగన్వాడీ కార్యకర్తలు జ్యోతి, సుభాషిణి, రేవతి తదితరులు పాల్గొన్నారు.



కూచిపూడిలో..

పామర్రు: అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, చిన్నారులు సద్వినియోగం చేసుకుని తమ మూడేళ్ల లోపు చిన్నారులను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని పామర్రు ఐసీడీఎస్ సెక్టార్ అధికారిణి నూతక్కి సత్యశ్రీ అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పామర్రులో ఒకటి నుంచి ఐదుగ్రామ సచివాలయాల పరిధిలోగల అంగన్వాడీ కేంద్రాలలో గురువారం చిన్నారులచేత ఆమె సామూహిక అక్షరాభ్యాసాలు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 24వరకు అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కూచిపూడి : మండల పరిధిలోని పలు అంగన్వాడీ కేంద్రాల్లో గురువారం చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా కూచిపూడి నాలుగో నెంబర్ అంగన్వాడీ కేంద్రంలో గ్రామంలో ఉన్న నాలుగు అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులను కలిపి సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొండవీటి విజయలక్ష్మి, సెక్టార్ సూపర్‌వైజర్ కళ్యాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కూనపరెడ్డి లక్ష్మీ కళ, కార్యకర్తలు సరస్వతీ, సుజ్ఞానం, వీరకుమారి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

నందివాడ: సామూహిక అక్షరాభాస్యం నందివాడ వెలుగు పథకం కార్యాలయంలో మండల విద్యాశాఖ అధికారి -2 డేవిడ్ రత్నరాజు ఆధ్వర్యంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ ఎన్.నాగశిరీష అధ్యక్షతన నందివాడ క్లస్టర్ అంగన్వాడీ సిబ్బందిచే అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మండల పంచాయతీ విస్తరణ అధికారి అమీర్ మీర్జా బాష, ఏవో కోటేశ్వరరావు పాల్గొన్నారు. పిల్లలచే అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్‌డీ అమీర్ మీర్జా బాష మాట్లాడుతూ 3 సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీ కిశోర్, ఏపీఎం ఎం.వసంతరావు, పాల్గొన్నారు.

పెదపారుపూడి : పెదపారుపూడిలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. యలమర్రు, భూషణగుళ్ల, వానపాముల-1 అంగన్వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్లు ఎం.శివనాగరాణి, అరుణకుమారి అంగన్వాడీ కేంద్రాల్లో అధ్యక్షతన మూడేళ్ల పిల్లలందరికీ సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ చదువుకు తొలి అడుగు అక్షరాభ్యాసం అని అది అంగన్వాడీ కేంద్రం నుంచి ప్రారంభమవుతుందని వివరించారు. అంగన్వాడీ కేంద్రంలో జరిగే కార్యక్రమాల గురించి ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు చెరుకూరి రమేష్, చెరుకూరి విజయ్, కుమార్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పెదపారుపూడిలో..

గుడ్లవల్లేరు : మండలంలో పలు అంగన్వాడీ కేంద్రాలలో గురువారం మూడేళ్లు దాటిన పిల్లలను అంగన్వాడీ కేంద్రాలలో చేర్పించి వారికి సామూహికంగా అక్షరాభ్యాసం చేయించారు. మండలంలోని 65 అంగన్వాడీ కేంద్రాలు ఉండగా దాదాపు 50 కేంద్రాల నుండి 46 మంది కొత్తగా మూడు సంవత్సరాలు నిండిన బాల,బాలికలను చేర్పించుకొని సెక్టార్ కేంద్రాలైన వడ్లమన్నాడు, డోకిపర్రు, గుడ్లవల్లేరు, విన్నకోట, కౌతవరం తదితర కేంద్రాల్లో ఈ సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమాలు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈ.వాణి పాల్గొన్నారు



పామర్రులో..

పమిడిముక్కల : మండలపరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు గురువారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. కృష్ణాపురం కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సలీమున్నీసా పాల్గొని చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించి అక్షరాలు దిద్దించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తుకు అంగన్వాడీ కేంద్రాలు బంగారు బాటగా నిలుస్తాయని ప్రతి తల్లీ తప్పకుండా పిల్లలను పంపించాలన్నారు. సర్పంచ్ బలుసులమ్మ, స్కూల్ టీచర్ జయశ్రీ, అంగన్వాడీ కార్యకర్తలు పరమేశ్వరి, శివలక్ష్మి వెంకటేశ్వరమ్మ, గంగాభవాని పాల్గొన్నారు.



పమిడిముక్కలలో..

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	116, 125, 136
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 535

జీవన సౌరభాలు పద్యకవితా సంపుటి ఆవిష్కరణ 15న

చల్లపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీ ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ హాల్ (సబ్ కోర్టుల ఎదురుగా)లో డాక్టర్ ఓలేటి ఉమాసరస్వతి పద్యకవితా సంపుటి "జీవన సౌరభాలు" ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్ తెలిపారు. సాహితీవేత్త, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చేతుల మీదుగా ఆవిష్కరణ జరుగుతుందన్నారు. రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు అధ్యక్షతన జరిగే సభలో ప్రముఖ రచయిత డాక్టర్ జి.వి.పూర్ణచంద్, సాహితీ విశ్లేషకులు గుమ్మా సాంబశివరావు, కృతి స్వీకర్త బి.షణ్ముఖన్ పాల్గొంటారన్నారు.



మంత్రి అచ్చెన్నాయుడు నుంచి అవార్డు అందుకుంటున్న డాక్టర్ సుధారాణి

కేవీకే కో-ఆర్డినేటర్ డాక్టర్ సుధారాణికి ఉత్తమ శాస్త్రవేత్త పురస్కారం

ఘంటసాల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.సుధారాణి ఉత్తమ శాస్త్రవేత్త పురస్కారాన్ని అందుకున్నారు. వ్యవసాయ విద్యాలయం 62వ ఆవిర్భావం సందర్భంగా గుంటూరు లాం ఫామ్ కార్యక్రమంలో సుధారాణికి బంగారు పతకం, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. చెరకు పంటలో చేపట్టిన పరిశోధనలకు గానూ ఉత్తమ శాస్త్రవేత్తగా సుధారాణిని ఎంపిక చేసి వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు చేతులమీదుగా అవార్డు అందజేశారు. ఉత్తమ శాస్త్రవేత్త పురస్కారం అందుకున్న డాక్టర్ డి.సుధారాణిని కెవికె శాస్త్రవేత్తల బృందం, రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది అభినందనలు తెలిపారు.



యోగాంధ్ర ఏర్పాట్లు ఆర్డీవో స్వాతి పరిశీలన

ఘంటసాల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ఘంటసాలలో శుక్రవారం ఉదయం బౌద్ధస్థూపం ప్రాంగణంలో జరుగనున్న యోగాంధ్ర సంబంధించిన ఏర్పాట్లను ఆర్డీవో స్వాతి గురువారం పరిశీలించారు. అధికారులతో మాట్లాడి ఏర్పాట్లపై ఆరా తీశారు. యోగా కార్యక్రమానికి మంత్రి కొల్లు రవీంద్ర, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, కలెక్టర్ డీకే బాలాజీ విచ్చేస్తున్నారని, కార్యక్రమం విజయవంతమయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. బి.విజయ ప్రసాద్, ఆర్ఐ శ్రీనివాస్, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

హిందూ చైతన్య వేదిక ఆర్థిక ప్రముఖ్‌గా హరిబాబు



పెడన, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : హిందూ చైతన్యవేదిక జిల్లా ఆర్థిక ప్రముఖ్‌గా సహకార శాఖ విశ్రాంత ఉద్యోగి తోట హరిబాబు నియమితులయ్యారు. హరిబాబుకు హిందూ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వెంగళరావు గురువారం పైడమ్మ దేవస్థానంలో బాధ్యతలు అప్పగించారు. హిందూ చైతన్యవేదికజిల్లా అధ్యక్షుడు నాదెళ్ళ కోటేశ్వరరావు, దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్త తోట రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారంజక పాలన

• సుపరిపాలనకు ఏడాది వేడుకల్లో నేతల ఉద్ఘాటన

పెడన/పెడన రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఇస్తూ ప్రజారంజక పాలన అందిస్తోందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో గురువారం ఏడాది పాలన సంబరాలు జరుపుకున్నారు. కృష్ణప్రసాద్ కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. బాణాసంచా కాల్చి ప్రజలకుమిఠాయిలు పంచి పెట్టారు. శలపాటి ప్రసాద్, అర్జా నగేష్, శీరం ప్రసాద్, యక్కల శ్యామలయ్య, బొల్లా నాగేశ్వరరావు, తమ్మా బీమయ్య తదితరులు పాల్గొన్నారు. బస్టాండ్ సెంటర్‌లో పట్టణ టీడీపీ అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. హన్నూ, వహబ్‌ఖాన్, కమ్మగంటి బాబు, వాసా సాంబశివరావు, వీణం శ్రీనివాస్, ఖుర్షిద్ బేగం, పరసా సూర్యనారాయణ, ఖదీర్, జనసేన పార్టీ నాయకులు కూనపరెడ్డి రంగయ్యనాయుడు, నాని, బీజేపీ నాయకులు మామిడి లక్ష్మీనారాయణ గుప్తా, కొల్లూరి రాధాకృష్ణగుప్తా పాల్గొన్నారు. **బంటుమిల్లి :** కూటమి ప్రభుత్వ ఏడాది పాలన పూర్తి అయిన సందర్భంగా ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో మండలంలో విజయోత్సవ ర్యాలీలు జరిగాయి. బంటుమిల్లి, అర్తమూరు, తుమ్మిడి, తదితర గ్రామాల్లో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. మండల పార్టీ అధ్యక్షుడు కూనపరెడ్డి వీరబాబు, డీసీ చైర్మన్ బొర్రా కాశీ, ఎండి నూర్, నజీర్, జరీనా, భూపతి రమేష్, కాగిత రవి, తెనాలి సుధాకర్, ర్యాలీ సత్యనారాయణ, కూటమి నాయకులు పాల్గొన్నారు. **గూడూరు :** గూడూరులో విజయోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ కేకు కట్ చేశారు. డీసీ చైర్మన్ పోతన స్వామి, జనసేన పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి పంచకర్ల సురేష్, ఎస్‌ఏ బేగ్, గోపీ నాగబాబు, అన్నం హరిరామకృష్ణ, కట్టా మునీశ్వరరావు, దాసరి ఉమాసాయిరామ్, టీడీపీ,జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. **మోపిదేవి :** పార్టీ కార్యాలయం వద్ద ఎంపీపీ రావి దుర్గావాణి, మాజీ ఎంపీపీ మోర్ల జయలక్ష్మీ కట్ చేశారు. మిఠాయిలు పంచి బాణాసంచా కాల్చి ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. మండల టీడీపీ అధ్యక్షుడునడకుదుటి జనార్ధనరావు, సర్పంచ్ దిడ్ల జానకి రాంబాబు, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు చందన రంగారావు, రావి నాగేశ్వరరావు, బల్లా సీతారామ ప్రసాద్, కడవకొల్లు సీతారామాంజనేయులు, రావి రత్నగిరి, నాగినేని శేషగిరిరావు, నందిగం శంకర్, డొకిపర్తి బాలకోటేశ్వరరావు, బెల్లంకొండ ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు. **కోడూరు :** టీడీపీ మండల అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విజయోత్సవం నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. పూతబోయిన శ్రీనివాసరావు, కాగిత ప్రసాద్, పిల్లి మల్లికార్జునరావు, అప్పికట్ల రవీంద్ర, కొక్కిలిగడ్డ జాన్ విల్సన్, కొప్పనాతి సత్యనారాయణ, అద్దంకి పాండురంగారావు, బొలిశెట్టి విఠల్‌రావు, ఉప్పాల కోటేశ్వరరావు, వేముల లక్ష్మణరావు, నిడమానూరి దిలీప్ కుమార్, మోర్ల రాంబాబు, మాచవరపు ఆదినారాయణ, పైడిపాముల కృష్ణకుమారి, విజయ్, పరుచూరి దుర్గా ప్రసాద్, బండే కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు యాసం చిట్టిబాబు ఆధ్వర్యంలో కోడూరు రోడ్డులో విజయోత్సవం నిర్వహించారు. అన్నపరెడ్డి లక్ష్మీనారాయణ, విశ్వనాథుని మురళీ మోహన్, మండలి వెంకటేశ్వరరావు, గుగ్గిలం శ్యామ్ కుమార్ తదితరులు పల్లి రాజేష్, గంజాల సుందరరావు, గోగినేని సోమశేఖరరావు పాల్గొన్నారు. **అవనిగడ్డ :** బస్టాండ్ సెంటర్‌లో నియోజకవర్గ టీడీపీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. దివి మార్కెట్ కమిటీ ఛైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నేతలు మండవ బాలవర్థిరావు, విశ్వనాథపల్లి పాప, మెండు రావు, తలశిల స్వర్ణలత, ఏఎంసీ ఛైర్మన్లు కొల్లూరి వెంకటేశ్వరరావు, తోట కనకదుర్గ, లంకే యుగంధర్, గాజుల శంకరరావు, కొండవీటి సునీత, అన్నపరెడ్డి వెంకట స్వామి, యాసం చిట్టిబాబు, నడకుదుటి జనార్ధనరావు, రాజనాల వీరబాబు, కోట రాంబాబు, బొందలపాటి వీరబాబు, సనకా ప్రశాంత్, గుడివాక శివాజీ, శోభిల ఏడుకొండలు, బండే కనకదుర్గ, మోర్ల జయలక్ష్మీ, బచ్చు కృష్ణకుమారి, దేవు వెంకట రాజు పాల్గొన్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కార్యాలయంలో కూటమి ఆధ్వర్యంలో సుపరిపాలన తొలి అడుగు వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు కూటమి నాయకులు పాలాభిషేకం చేశాఆరు. కేక్ కట్ చేశారు. మత్తి వెంకటేశ్వర



బంటుమిల్లిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కాగిత



మోపిదేవిలో కేక్ కట్ చేస్తున్న పార్టీ నాయకులు



కోడూరు ప్రధాన సెంటర్‌లో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నేతలు



చల్లపల్లి ప్రధాన సెంటర్లో కేక్ కట్ చేస్తున్న కూటమి నేతలు



అవనిగడ్డలో కేక్ కట్ చేస్తున్న కూటమి నేతలు

చల్లపల్లి : కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఏడాదైన సందర్భంగా చల్లపల్లి ప్రధాన సెంటర్లో గురువారం సంబరాలు జరిగాయి. నేతలు కేక్ కట్‌చేసి, టపాసులు కాల్చారు. టీడీపీ మండల అధ్యక్షుడు మోర్ల రాంబాబు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఏఎంసీ ఛైర్మన్ తోట కనకదుర్గ, డీసీ ఛైర్మన్ నిడమానూరి దిలీప్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు పైడిపాముల స్వప్న, మాలెంపాటి శ్రీనివాసరావు, షేక్ నబీఘోరి, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, నేతలు బోలెం నాగమణి, కొడాలి మురళి, మోర్ల ప్రసాద్, జల్లూరు ప్రసాద్, రావి చిట్టి, మోర్ల శివ, బీజేపీ మండల అధ్యక్షుడు పిండి రేవతి, జనసేన అధ్యక్షుడు బొందలపాటి వీరబాబు, తాతా ప్రదీప్‌లతోపాటు కూటమి నేతలు, టీడీపీ గ్రామ శాఖల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నేతలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం

ఘంటసాల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : మూడు సంవత్సరాలు నిండిన చిన్నారులను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సర్పంచ్ బాణావత్ వెంకటేశ్వరమ్మ, ఎంపీపీ వేమూరి రజనీ కుమారి అన్నారు. అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా గ్రామంలో చిన్నారులతో ఐసీడీఎస్ అధికారులు, ప్రజాప్రతినిధులు ర్యాలీ నిర్వహించి, అనంతరం చిన్నారులచే అక్షరాభ్యాసం చేయించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.రమా నాగమణి, వార్డుసభ్యురాలు సుజాత, మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. **చల్లపల్లి :** అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని అంగన్వాడీ కేంద్రాల్లో గురువారం సామూహిక అక్షరాభ్యాసాలు జరిగాయి. నారాయణరావునగర్ కాలనీలోని మోడల్ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సిహెచ్.ఆదిలక్ష్మి చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేశారు. అంగన్వాడీ కార్యకర్తలు ఎస్‌కె.ముంతాజ్‌బేగం, బసవపూర్ణ, ఆశ కార్యకర్త వి.సీతారావమ్మ తదితరులు పాల్గొన్నారు. **బంటుమిల్లి :** బంటుమిల్లిలో అంగన్వాడీ చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఎంపీపీ వెలివెల చినబాబు, ఎంపీడీవో నీరాజాక్షి, ఈవోపిఆర్‌డి శైలజ, సీడీపీ సముద్రవేణి, సూపర్‌వైజర్ నాగలక్ష్మీ పాల్గొన్నారు.



బంటుమిల్లిలో సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న నాయకులు

రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలి

మోపిదేవి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి రైతు లు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఏవో కె.హెబ్సిబా రాణి తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఇప్పటి వరకు ఈకే వైసీ చేయని రైతుల వివరాలు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని, సంబంధిత రైతులు రైతు సేవా కేంద్రాలకు ఆధార్ కార్డు, వన్- బి అడంగల్ ధ్రువపత్రం తీసుకెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

భారీ అన్నసమారాధన

కోడూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : కోడూరులో శ్రీ దేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం 29వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం పది వేల మంది భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు. విశేష అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ట్రస్టీ కోట పద్మావతి ప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించగా, అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

లక్ష్మీపురంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్

చల్లపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ఘంటసాల కృషివిజ్ఞాన కేంద్రం, చల్లపల్లి వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గురువారం లక్ష్మీపురంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం జరిగింది. శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు ఖరీఫ్ సాగు, సాంకేతిక పరిజ్ఞానం తదితర విషయాలపై అవగాహన కల్పించి రైతులకు సూచనలు అందించారు. మొవ్వ ఏడీఏ శ్యామల, శాస్త్రవేత్తలు డాక్టర్ బి.నవీన్, డాక్టర్ అనిత, డా.పద్మావతి, ఏవో జి.సాయి సింధు, కీర్తి, సర్పంచ్ కొల్లూరు కోటేశ్వరరావు, ఈవో ఉమామహేశ్వరరావు, వీఏ ఏలు, రైతులు పాల్గొన్నారు.

వాసవీలో డీఎస్సీకి అభ్యర్థుల హాజరు ఇలా..

పెడన రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : నందమూరు వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో ఏపీ మెగా డీఎస్సీకి గురువారం జరిగిన పరీక్షకు 181 మంది విద్యార్థులకు 171 మంది, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 69 మంది 48 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ బిఆర్ఎస్ రెడ్డి దెలిపారు.

జిల్లా స్థాయి యోగా పోటీలకు స్పందన



మచిలీపట్నం టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం పిన్నమనేని టీచర్స్ గిల్డ్ హోంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి యోగా పోటీలకు మంచి స్పందన లభిస్తోంది. గురువారం జరిగిన పోటీల్లో జూనియర్స్, సీనియర్స్ పాల్గొన్నారు. యోగాసనాల ప్రదర్శన నిర్వహించారు. పెయింటింగ్ వేశారు. క్విజ్, వ్యాసరచన పోటీలు జరిపారు. న్యాయ నిర్ణేతగా జి. కృష్ణ వ్యవహరించారు. జిల్లా ఇంటర్ బోర్డు అధికారి సాల్మన్‌రాజు, ఆయూష్ ప్రతినిధులు ప్రసూన, వాహిని, జవాద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



పెడన : పెడనలో ఏడాది పాలన విజయోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అనారోగ్యంతో బాధపడుతున్న పట్టంలోని 14వ వార్డుకు చెందిన వాసా రవిశంకర్, 21వ వార్డుకు చెందిన యర్రా నాగసదాశివయ్యలకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు.

ఫైర్ స్టేషన్ అధికారి ప్రసాద్‌కు ఘనసత్కారం



అవనిగడ్డ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : సింగ్‌నగర్‌కు బదిలీ అయిన అవనిగడ్డ ఫైర్ స్టేషన్ అధికారి పిఎస్‌వివి.ప్రసాద్‌ను గురువారం స్టేషన్ ఆవరణలో ఆర్టీసీ డిపో మేనేజర్ హనుమంతరావు తదితరుల ఘనంగా సత్కరించారు. విధి నిర్వహణలో ప్రసాద్ అంకితభావంతో పని చేశారని కొనియాడారు. ఫైర్ ఆఫీసర్ సుధాకర్, ఫైర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి



మచిలీపట్నం టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలని, బడిఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలని మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ గోపు సత్యనారాయణ అన్నారు. కానూరు గ్రామ పంచాయతీ వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 18 ఏళ్ళలోపు ఉన్న పిల్లలను పనుల్లో పెట్టడం నేరమని క్రై సంస్థ ప్రతినిధులు ఎఫ్రాన్ తెలిపారు. జనసేన నాయకులు దివి మహేష్, బొలిశెట్టి నాని, బొమ్మిడి పెద ఏడుకొండలు, ఈమన ఏసు, బొమ్మిడి కొండలరావు, వెంకటేశ్వరరావు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



గూడూరులో విద్యా కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాగిత



నారాయణరావునగర్ పాఠశాలలో విద్యా కిట్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్ కృష్ణకుమారి

విద్యా సంవత్సరం తొలిరోజే విద్యాకిట్ల పంపిణీ

మోపిదేవి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలు పునః ప్రారంభం కావ టంతో ప్రభుత్వంతో అందించిన విద్యా కిట్లు పంపిణీ చేశారు. కొక్కిలిగడ్డ ప్రాథమికోన్నత పాఠశాలలో 164 మందికి కిట్లను సర్పంచ్ దిడ్ల జానకి రాంబాబు పంపిణీ చేశారు. మోపిదేవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు జయంతి, పెదప్రోలు ప్రాథమిక, జడ్పీ పాఠశాలల్లో సర్పంచ్ పోలిమెట్ల ఏసుబాబు విద్యార్థులకు కిట్లను పంపిణీ చేశారు. కోడూరు: విద్యార్థి మిత్ర కిట్స్ విద్యార్థులకు ఎంఈవో టివి.ఎం. రామదాసు గురువారం విశ్వనాథపల్లి ఎంపీయూపీ పాఠశాలలో పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా 46 పాఠశాలలో 1927 మంది విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్ అందించామని తెలిపారు. విద్యా కమిటీ ఛైర్మన్‌లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవనిగడ్డ రూరల్ : అశ్వారావుపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు హెచ్‌ఎం రవి కిరణ్, ఉపాధ్యాయులు కోసూరు సముద్రాలు విద్యార్థి కిట్లు అందించారు. **నాగాయలంక :** మండలంలోని 51 పాఠశాలల్లో 2569 మంది విద్యార్థులకు పాఠశాల పునఃప్రారంభం రోజున కిట్లను పంపిణీ చేశారు. ఎంఈవో-2 ఏ.రామారావు పర్యవేక్షించారు. **పెడన :** సమగ్ర శిక్ష జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ కుమిదిని సింగ్ అన్నారు. బంగ్లా స్కూల్‌లో గురువారం విద్యార్థులకు విద్యామిత్ర కిట్లు పంపిణీ చేశారు. సమగ్ర శిక్ష సీఎంఓ టి. రమేష్, ఎంఈవో-2 వై.వి. హరనాథ్, హెచ్‌ఎం జి.భాగ్యలక్ష్మీ, ఎస్‌ఎంసీ వైస్‌ఛైర్మన్ తదితరులు పాల్గొన్నారు. **గూడూరు :** గూడూరులో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పంపిణీ చేశారు. డ్వాక్రా మహిళలకు లింకేజి రుణాల చెక్కులను, మొక్కలను పంపిణీ చేశారు. రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలు, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేశారు. డీసీ ఛైర్మన్ పోతన స్వామి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పంచకర్ల సురేష్, కూటమి నాయకులు ఎస్‌ఏ బేగ్, అన్నం హరిరామకృష్ణ, గోపీ నాగబాబు, కాసగాని శ్రీనివాసరావు, ఎంపీడీవో, వ్యవసాయ శాఖ, మండల విద్యాశాఖాధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. **చల్లపల్లి :** పాఠశాలల పునఃప్రారంభం రోజునే ప్రభుత్వం విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాల పంపిణీ ప్రారంభించింది. నారాయణరావు నగర్‌లోని మోడల్ ఎలిమెంటరీ పాఠశాలలో సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. మధ్యాహ్న భోజన పథకం కోసం సన్నబియ్యం సరఫరా చేయగా, వాటిని పరిశీలించారు. హెచ్‌ఎం కైతేపల్లి దాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.